

## డిసెంబర్‌లోనే ఐపీఎల్ వేలం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ పంతొమ్మిదో సీజన్ వేలం డిసెంబర్‌లో జరుగనున్న విషయం తెలిసిందే. ఆ నెల రెండో వారంలో వేలం ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులు భావిస్తున్నారు. అయితే.. ఈసారి వేలం నిర్వహణ ఎక్కడ? అనే విషయంలో మాత్రం ఇప్పటివరకూ స్పష్టత రావడం లేదు. గత రెండు సీజన్ల మాదిరిగానే ఈసారి కూడా విదేశాల్లోనూ జరుగనుందనే వార్తలు వినిపిస్తున్నాయి.పదిహేడో సీజన్ వేలంను దుబాయ్‌లో, 18వ సీజన్ మెగా వేలాన్ని సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిపిన విషయం తెలిసిందే. పంతొమ్మిదో సీజన్ వేలం ప్రక్రియను యూఏఈలోని అబూదాబీలో నిర్వహిస్తారని టాక్. ఒకవేళ అక్కడ వద్దనుకుంటే ఒమన్ లేదంటే ఖతార్‌లో వేలం జరిపే అవకాశముంది.


నిజామాబాద్
మంగళవారం
04.11. 2025

సంపుటి : 16 సంచిక: 37
పేజీలు: 7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


# చట్టం


సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


# మృత్యువాత



- రంగారెడ్డి జిల్లాలో ఘోరమైన రోడ్డు ప్రమాదం
- ఈ ప్రమాదంలో 19 మంది చనిపోయారు
- ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి సంతాపం
- తాండూర్- హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు
- కంకర లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది
- 15నెలల పాప కూడా ప్రమాదంలో మృతి
- ఈ ప్రమాదానికి ముఖ్య కారణం చేవెళ్ల రహదారి
- సబితా రెడ్డి, ఎమ్మెల్యే కల్లెపై జనం ఆగ్రహించారు
- మహాలక్ష్మి పథకం కూడా కారణమనే ఆరోపణలు
- బస్సుల్లో సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణికులు

**రంగారెడ్డి జిల్లాలో ఘోరమైన రోడ్డు ప్రమాదంచోటు చేసుకుంది. తాండూర్ నుంచి హైదరాబాద్ కు వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా కంకర లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో టిప్పర్ పూర్తిగా బస్సుపై పడిపోవడంతో డ్రైవర్ వైపు ఉన్న భాగం మొత్తం విరిగిపోయింది. అందులోని కంకర పూర్తిగా బస్సులో చేరిపోవడంతో ప్రయాణికులు మునిగిపోయి మృతి చెందారు.**



**చట్టం, స్టేట్ బ్యూరో:**

ఈ ప్రమాదంలో మొదట 17 మంది మృతి చెందారు. ప్రమాద తీవ్రత అధికంగా ఉండంతో మృతుల సంఖ్య పెరుగుతోంది. ప్రయాణికులు కంకరలో కూరుకుపోవడంతో ఎక్కువ మంది చనిపోయారు. ఇప్పటి వరకు 19 మంది చనిపోయారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చేవెళ్ల ఆస్పత్రిలో 10 మందికి వైద్యం చేస్తున్నారు. మరణించిన వారిలో అభం శుభం తెలియని 15నెలల పాప మృతి చెందడంతో ప్రమాద స్థలంలోని ప్రజలు కన్నీటి పర్వంతమైరు. ఒక కుటుంబంలోనే ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతిచెందారు. ఘటనా స్థలంలో తల్లి గుండెలు బాదుకుని ఏడుస్తుంటే చూసేవారికి సైతం కన్నీళ్లు వచ్చాయి. ఆర్టీసీ డ్రైవర్ అక్కడిక్కడే చనిపోగా కండక్టర్ తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. బస్సులో ఉన్న మృతులను బయటికి తీసే సందర్భంలో స్థానిక సీఐ శ్రీధర్ కాళ్ళ పైకి జేసీబీ వెళ్లి తీవ్ర గాయమైనట్లు తెలుస్తుంది. కంకరతో నిండిన బస్సులోని మృతిదేహాలను, క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని నిమ్స్, గాంధీ ఆస్పత్రులకు తరలించారు.

ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులో దాని సామర్థ్యమైన 52 సీట్లకు మించి సుమారు 7075 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధిక రద్దీతో నిండిన బస్సును ఎదురుగా అతివేగంగా, అధిక లోడుతో వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో క్షణాల్లో ఈ ఘోరం జరిగింది. ఈ దుర్ఘటనలో రహదారి పరిస్థితులు, వాహనాల అధిక లోడ్, నిర్లక్ష్య విధానాలు అన్నీ కలిసి ప్రాణాలను బలితీసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ' (మహాలక్ష్మి) పథకం తర్వాత చాలా ప్రాంతాల్లో ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తగ్గించడం లేదా ఆపరేషన్లను మార్చడం జరిగింది. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తక్కువ సంఖ్యలో ఉన్న ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిణామం కారణంగా బస్సుల్లో అధిక రద్దీ పెరిగిపోయిందని, ఈ రద్దీయే ఇలాంటి ప్రమాదాలకు ఒక కారణంగా మారుతోందని కొందరు నెటిజన్లు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ ప్రమాదానికి మరో ముఖ్య కారణం చేవెళ్ల రహదారి (హైవే) దుస్థితి. రహదారి సన్నగా ఉండటం, వాహనాల రద్దీ 170శాతం వరకు పెరిగినప్పటికీ, రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడం పెద్ద సమస్యగా మారింది. రహదారి విస్తరణకు చాలాకాలంగా డిమాండ్ ఉన్నప్పటికీ, రాజకీయ వివాదాలు, కోర్టు కేసులు, బనియన్ చెట్ల సంరక్షణ వంటి అంశాలతో ప్రాజెక్టు నిలిచిపోయింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2023లో పర్యావరణ ప్రభావ నివేదిక సమర్పించాలని ఆదేశించినప్పటికీ, తదుపరి ఆమోదాలు, ఫిర్యాదులతో ప్రాజెక్టు ఆలస్యమవుతూ వచ్చింది. రహదారిని సకాలంలో విస్తరించడంలో జరిగిన రాజకీయ నిర్లక్ష్యం, ప్రభుత్వ నిర్లిప్తత ప్రజల ఆగ్రహానికి కారణమై, ప్రమాద స్థలంలో ఎమ్మెల్యే కల్లె యాదయ్యను చూసి "ఎంఎల్ఏ డౌన్ డౌన్!" అంటూ నినాదాలు చేసే పరిస్థితికి దారితీసింది.మరికొందరు రాళ్లు విసిరారు. పరిస్థితి చేయిదాటిపోతుందని గమనించిన అనుచరులు అక్కడి నుంచి ఆయనను పంపించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఎమ్మెల్యే యాదయ్య అక్కడి నుంచి నిష్క్రమించారు. నిత్యం ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులతో స్థానికులు వాగ్వివాదానికి దిగారు. ఆర్టీసి బస్సును ఇక్కడి నుంచి తొలగించవద్దని పోలీసులను బాధితుల బంధువులు హెచ్చరించారు.

చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పీ.సబితా రెడ్డిని నిలదీశారు. మీరు ఈ ప్రాంతానికి చేసిందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేవెళ్లకు మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఏమీ చేయలేదని, మరో మాజీ మంత్రి సబితారెడ్డి కూడా ఏమీ చేయలేదని ప్రమాదంలో తన కుమార్తెను కోల్పోయిన తండ్రి ఆక్రోశం వ్యక్తం చేశారు. సబితా రెడ్డి మంత్రిగా ఉన్నా రోడ్డు వేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా చేసిందేమి లేదన్నారు. వీళ్లు పట్టించుకుంటే ఈ ఘోర ప్రమాదం జరిగేది కాదన్నారు. అధికారంలో ఉంటూ వాళ్ల ఆస్తులు పెంచుకున్నారంటూ దూషించారు. తమ ఆస్తులను కాపాడుకునేందుకు రోడ్డు విస్తరణ అడ్డుకున్నారన్నారు. ఈ యాక్సిడెంట్ కు కారణం ఈ నలుగురు నాయకులేనన్నారు. వీళ్లు తప్పకుండా బాధ్యత వహించాలన్నారు. నా సోదరుడి కుమార్తె అఖిల ఈ దుర్ఘటనలో చనిపోయిందన్నారు. ఎంబీఏ చదువుతున్నదని, మంచి భవిష్యత్తు ఉన్న అమ్మాయిని కోల్పోయామన్నారు. సబితారెడ్డి మా తాండూరు ఆడబిడ్డనే, ఈ రోడ్డును పట్టించుకుని పూర్తి చేస్తే ఇంతమంది చనిపోయేవారు కాదన్నారు. మేడం మీరే కారణం అని ఆయన ఆమెను నిలదీశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య కొద్ది సేపు వాదులాట జరిగింది.

హైదరాబాద్ నుంచి వికారాబాద్ వరకు ఇది ఒక్కటే జాతీయ రహదారి అని చేవెళ్ల బీజేపీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ రోడ్డు నేనే తెచ్చాను, భూ సేకరణ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆపిందని విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్ల నుంచి పనులు కాకుండా అడ్డుకుందన్నారు. 2017 లో నేనే కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తో చెప్పి నిధులు మంజూరు చేయించానన్నారు. తెలంగాణకు 11 జాతీయ రహదారులు మంజూరు కాగా, 10 పూర్తి అయ్యాయని, ఈ ఒక్క రోడ్డు పూర్తి కాలేదన్నారు. కరీంనగర్, నల్లగొండలో జాతీయ రహదారులకు భూ సేకరణ పూర్తి అయ్యిందని, ఇక్కడ మాత్రం చేయలేదన్నారు. రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ కన్పిస్తుందని, ప్రజల కష్టాలు ప్రభుత్వాలకు కన్పించవన్నారు. రియల్ ఎస్టేట్ కోసం వంకర టింకర గా భూ సేకరణ చేశారన్నారు. నేరుగా అలైన్ మెంట్ ఖరారు చేయాలని కోరగా, మర్రి చెట్లు పోతున్నాయని చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ లో కొందరు కేసు వేయించారన్నారు. ఇక్కడి ప్రజలు కేసు వేయలేదని, చెన్నై వాసులు కేసు వేశారన్నారు. ట్రిబ్యునల్ లో కేసు కూడా పరిష్కారం అయ్యిందని, ఏడాదిన్నరలో రోడ్డు విస్తరణ పూర్తవుతుందన్నారు.



కాగా, ప్రైవేట్ బస్సుల్లో సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణికులు ఉంటే ఆర్టీఏ అధికారులు ఫైన్లు విధిస్తారు. కానీ, ఆర్టీసీ బస్సుల్లో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా సీటింగ్ కెపాసిటి రూల్ ను తుంగలో తొక్కుతున్నారు. ఉదాహరణకు పల్లెవెలుగు బస్సులకు 45-48 సీట్లు ఉంటే నిలబడి ప్రయాణించేందుకు గరిష్టంగా 10-15 మందికి మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ, దీనికి ఏ మాత్రం సంబంధం లేకుండా లెక్కు మించి బస్సు మొత్తం ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులను మనం ఎన్నోసార్లు చూస్తాం. ముఖ్యంగా పండుగలు ఉన్న సందర్భాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. జనం ఊపిరితీసుకోలేని విధంగా కూడా ప్యాసెంజర్లను ఎక్కించుకుని ప్రయాణించిన బస్సులు లేకపోలేదు. ఓవర్‌లోడింగ్ వల్ల బస్సు స్థిరత్వం తగ్గి బ్రేకుల వ్యవస్థ, టైర్లు, సస్పెన్షన్ దెబ్బతింటాయి. దీని వల్ల చిన్న తప్పిదం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు. అయితే, కెపాసిటీ లిమిట్ ఉన్నా.. దానిని అధికారులు అమలు చేయడం లేదనే వాదనలు ఉన్నాయి. మరోవైపు బస్సుల కొరత, ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరగడం కూడా దీనికి కారణంగా ఉంది. కాగా, అసలు ఆర్టీసీకి ఓవర్ లోడ్ పరిమితి ఉందా? అనేది ఇప్పుడు చాలా మందిలో రేకెత్తున్న ప్రశ్న. ఆర్టీసీ యాజమాన్యం సరైన చర్యలు తీసుకుని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**తెలంగాణలో ఈ తరహా బస్సు ప్రమాదాలు చాలానే చోటుచేసుకున్నాయి. 2018లో జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి తిరిగి వస్తున్న టీఎస్ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డు వద్ద గల లోయలాంటి ప్రదేశంలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఏకంగా 57 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద బస్సు ప్రమాదంగా ఇది నిలిచింది. బ్రేక్ ఫెయిల్ కావడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అప్పట్లో కథనాలు వచ్చాయి.2013 మహబూబ్ నగర్‌లో బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు వోల్వో బస్సు కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో కల్వర్ట్ ను ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా మంది బస్సులోనే సజీవ దహనం కావడం దేశవ్యాప్తంగా అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 మెదక్ జిల్లా మూసాయిపేటలో రైల్వే టాక్ ను క్రాస్ చేస్తూ స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది. పట్టాలను బస్సు దాటుతున్న క్రమంలో నాందేడ్ – హైదరాబాద్ ప్యాసింజర్ రైలు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 17 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఖమ్మం జిల్లా నాయకన్ గూడెం వద్ద బస్సు కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు..మరో 18 మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరారు.**

## బస్సు ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

- **మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా – బాధితులకు అన్ని విధాల అండగా ప్రభుత్వం**
- **ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణ స్పందన**
- **మెజిస్ట్రియల్ విచారణకు ఆదేశాలు – రంగారెడ్డి కలెక్టర్, మంత్రుల పర్యవేక్షణ**



**చట్టం రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనలో గాయపడిన బాధితులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు. క్షతగాత్రులను ఆరాతీశి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...ఇది ఒక దురదృష్టకరమైన ఘటన. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. బాధితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుంది. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించబడుతోంది. మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని తెలిపారు.అలాగే ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారని చెప్పారు.సీఎం వెంటనే మంత్రులు, అధికారులను అప్రమత్తం చేసి, ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని పరిశీలించాలంటూ ఆదేశించారు. బాధితులకు మెరుగైన చికిత్స, అవసరమైన సహాయ చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు" అని తెలిపారు.సీఎస్, డీజీపీతో పాటు మొత్తం యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉంది. నాతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు కూడా ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. ప్రమాదానికి గల కారణాలను కనుగొనడానికి మెజిస్ట్రియల్ విచారణను ఆదేశించాము. అదనంగా శాఖాపరమైన విచారణ కూడా ప్రారంభమైందని వివరించారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి కూడా ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం చేవెళ్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వైద్య సదుపాయాలను పరిశీలించారు.



## బీసీలంతా ఏకం కావాలి

- **మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం**
- **అతిధిగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**చట్టం, స్టేట్ బ్యూరో:**



బీసీలంతా ఏకం కారనే అభిప్రాయం బీజేపీ, బీఆర్ఎస్ నేతల్లో ఉన్నదని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ క్లారిటీ ఇచ్చారు. ఆయన హైదరాబాద్ లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. బీసీలంతా ఏకం కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఐక్యంగా ఉంటేనే రిజర్వేషన్లు సాధించడం ఈజీ అని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బీసీ బిడ్డ నవీన్ యాదవ్ విజయానికి దోహదపడాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇక రాహుల్ గాంధీ సందేశం దేశంలో ఉద్యమంగా మారిందన్నారు.

రాహుల్ గాంధీఆకాంక్ష మేరకు ఎవరు ఎంత నిష్పత్తిలో ఉన్నారో వారికంతా రిజర్వేషన్లను ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. ఇదే నినాదం దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారిందన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న తీరును యావత్ దేశం గమనిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు నాయకత్వ అవకాశాన్ని కల్పించిందన్నారు. బీఆర్ఎస్‌లో బీసీ బిడ్డలను రాష్ట్ర అధ్యక్షులుగా చేయగలరా? అని ప్రశ్నించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ బీసీ బిడ్డ హనుమంతు రావును పీసీసీ అవకాశం కల్పించారన్నారు. బీసీ బిడ్డలను రాష్ట్ర అధ్యక్షులుగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. త్వరలో రిజర్వేషన్లు అమలు పక్కగా జరుగుతుందన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సందర్భంగా సర్వేల పేరిట అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ లు మండిపడ్డారు. తాజాగా ఓటర్లను ప్రభావితం చేసేలా కేకే సంస్థ తన సర్వే అంచనాలను బయట పెట్టిందని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రిటర్నింగ్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. కేకే సంస్థతో పాటు మరి కొన్ని సంస్థల సర్వేలపై ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. హరీష్, కేటీఆర్ కనుసన్నల్లో కేకే సర్వే జరిగిందన్నారు. ఇంట్లో కూర్చొని తయారుచేసిన రిపోర్టును పబ్లిక్ లోకి వదిలారన్నారు. గతంలో హర్యానా, ఢిల్లీలో నూ కేకే సర్వే తప్పుడు రిపోర్టులు ఇచ్చిందన్నారు. ఓటర్లకు తప్పుడు సంకేతాలు ఇచ్చే ఇలాంటి సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఎలక్షన్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. దీంతో పాటు సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ కు కూడా మెయిల్ రూపంలో కంప్లైంట్ ఇస్తామన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా.. కాంగ్రెస్ తప్పక గెలుస్తుందని వెల్లడించారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS



# రైతులకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- షాద్‌నగర్‌లో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ప్రైవేట్ మోసాలకు చెక్... ప్రభుత్వ కేంద్రాలకే ధాన్యం ఇవ్వండి.అధికారులు పిలుపు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం



**చట్టం,షాద్‌నగర్ ప్రతినిధి:–** రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వర్షాకాల ప్రభావంతో పంట నాణ్యతలో కొంత తేడా వచ్చినా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.సోమవారం ఫరూక్‌నగర్ మండలంలో పీఏసీఏస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శంకర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్ కుమార్, పీఏసీఏస్ చైర్మన్ బక్కన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ...రైతుల కష్టాన్ని ప్రభుత్వం అర్థం చేసుకుంటోంది. ప్రతి గింజ రైతుల చేతుల నుండి కొనుగోలు చేస్తాం.అధికారులు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్ మాట్లాడుతూ....రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర అందేలా మార్క్‌ఫెడ్ ద్వారా చర్యలు చేపట్టాం. రైతులు ధైర్యంగా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ మాట్లాడుతూ...షాద్‌నగర్ నియోజకవర్గంలో ఈ సీజన్‌లో సుమారు 37 వేల మెట్రిక్ టన్నుల వరి, 14 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పండించబడింది. రైతులు పంటను కొంత ఆరబెట్టి నాణ్యతతో తీసుకురాగలిగితే గిట్టుబాటు ధరలు వస్తాయి. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. పీఏసీఏస్ చైర్మన్ బక్కన్న యాదవ్ మాట్లాడుతూ...వర్షాల ప్రభావంతో ధాన్యంలో పచ్చదనం, నలుపు రంగు సమస్యలు ఎదురవుతున్నా రైతులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో కొనుగోలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, డైరెక్టర్లు కరుణాకర్, భరత్ లహోటీ, తిరుపతి రెడ్డి, క్యా సెట్ శ్రీనివాస్, పాండురంగారెడ్డి, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నెలరోజుల పాటు పోలీస్ యాక్ట్ అమలు

- సభలు, సమావేశాలు, ధర్నాలకు, నిరసనలకు అనుమతి లేదు
- ఎస్సై మోహన్ రెడ్డి



**చట్టం బిచ్కుంద ;** జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశానుసారం మండలంలో నెల రోజులపాటు పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు పోలీస్ అధికారుల అనుమతి లేనిదే నిర్వహించరాదని ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు నవంబర్ 1వ తేది నుండి 30 వరకు జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ. యం. రాజేష్ చంద్ర ఐ.పి.ఎస్ తెలిపినట్లు తెలిపారు . దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారని అన్నారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## చిన్న రాంపూర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన



**చట్టం న్యూస్ బాన్సువాడ :** చిన్న రాంపూర్ గ్రామంలో రూ.28 లక్షల SDF నిధులతో నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన యజ్ఞం, ప్రత్యేక పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. పుష్ప శోభతో, మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ శాసనసభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలను అభినందించిన నేతలు, దేవాలయాలు పల్లెల ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభురెడ్డి-ప్రేమల దంపతులు కూడా యజ్ఞంలో పాల్గొన్నారు. గ్రామస్తులు, భక్తులు, బాన్సువాడ పట్టణ-గ్రామీణ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా వాట్లంగారి దత్తు



**చట్టం న్యూస్ బాన్సువాడ :** తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాన్సువాడకు చెందిన వాట్లం గారి దత్తును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మూడ్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు దత్తు మాట్లాడుతూ ప్రభుత్వప్రైవేట్ విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితీసి, పరిష్కార దిశగా కృషి చేస్తామని తెలిపారు. టీఎస్ఎఫ్‌ను మరింత బలోపేతం చేస్తూ, విద్యార్థుల హక్కుల కోసం చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బోధన్ డివిజన్‌లో క్రియాశీలంగా బీర్కూర్ లయన్స్ క్లబ్

- 74 కార్యక్రమాల్లో బోధన్ డివిజన్లో ఫస్ట్ ప్లేస్



**చట్టం న్యూస్ బాన్సువాడ :** బోధన్ డివిజన్‌లో మొత్తం 12 లయన్స్ క్లబ్‌లలో, జులై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అత్యధికంగా 74 కార్యక్రమాలు నిర్వహించిన క్లబ్‌గా బీర్కూర్ లయన్స్ క్లబ్ మొదటి స్థానాన్ని సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని, బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్‌ని లయన్స్ క్లబ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్ బాబు గారి ఆధ్వర్యంలో వెండి నాణెం (సిల్వర్ కాయిన్) అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు క్లబ్ సభ్యుల సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, భవిష్యత్‌లో కూడా ఇదే ఉత్సాహంతో సేవలు కొనసాగించాలని అన్నారు.

## శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి, తుమ్మలను కలిసిన మాజీ జెడ్పీటీసీ సతీష్



**చట్టం న్యూస్ బాన్సువాడ :** బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ను ఆయన నివాసంలో మాజీ జెడ్పీటిసి ద్రోణవల్లి సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సతీష్ సుదర్శన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించినట్లు చర్చించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాంబాబు, మాజీ సర్పంచ్ గైని మారుతి, మాజీ సర్పంచ్ పర్సు గంగాధర్, ఎంపీటీసీ అంజయ్య, మాజీ జెడ్పీటిసి స్వరూప శ్రీనివాస్ యాదవ్, సాయిరాం, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి క్వాలిటీ కంట్రోల్ పై పర్యవేక్షణ



**చట్టం రామాయంపేట :** నిజాంపేట మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందుతున్న మిషన్ భగీరథ నీటిపై క్వాలిటీ కంట్రోల్ ఏఈ సుధాకర్, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి పర్యవేక్షించారు. మండలంలోని నగరం తండా గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గల మిషన్ భగీరథ నీటికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. వాటర్ ట్యాంకులు, ఇండ్లలోకి సరఫరా అయ్యే నీటిని పరిశీలించి వాటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్, మిషన్ భగీరథ హెల్పర్ పరశురాములు, బలిజ భాస్కర్ తదితరులు ఉన్నారు.

## జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు



**చట్టం రామాయంపేట :** జాతీయ ఆహార భద్రత పథకం కింద కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాల పంపిణీ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం పర్యవేక్షణలో ఇన్చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ నారాయణ మాట్లాడుతూ, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయడాన్ని ప్రోత్సహిస్తూ మొక్కజొన్న సాగు విస్తరణకు విభాగం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు పంట విత్తనం దశ నుంచి పంట కోత దశ వరకు అన్ని సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రామయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహనతో పాటు సబ్సిడీపై విత్తనాల పంపిణీ జరిగింది. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి విత్తనాలను పొందవచ్చు. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ (NSC) రూపొందించిన సీ.టి.4260 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నారు. ఈ రకం పంట కాలం 115-120 రోజుల మధ్యలో పూర్తవుతుంది. యాసంగి సీజన్‌కు అనుకూలంగా ఉండే ఈ రకం చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడి ఇవ్వగలదని అధికారులు తెలిపారు. నాలుగు కేజీల మొక్కజొన్న విత్తనం బ్యాగు ధర రూ.1380 కాగా, రూ.400 సబ్సిడీ, రైతులు కేవలం రూ.980 చెల్లించి విత్తనం పొందవచ్చు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్ కుమార్‌తో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో దివ్యాంగులకు ఉపకార వేతనాల పంపిణీ

**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో అర్హులైన దివ్యాంగులకు అవసరమైన ఉపకారణాల పంపిణీ కోసం ప్రత్యేక శిబిరాలను జిల్లా సంక్షేమ శాఖ ఏర్పాటు చేసింది. ఈ శిబిరాల ద్వారా దివ్యాంగులకు వీల్‌చెయర్లు, ట్రైసైకిళ్లు, హియరింగ్ ఎయిడ్స్, స్టిక్స్ వంటి అవసరమైన ఉపకారణాలను అందజేయనున్నారు. జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం తెలిపారు నిర్దేశిత తేదీల్లో అర్హులైన దివ్యాంగులు తాము నివసించే మండలానికి సంబంధించిన శిబిరంలో పాల్గొనాలని సూచించారు. శిబిరాలకు హాజరయ్యే వారు తమ దివ్యాంగ సర్టిఫికేట్, కనీసం 40 శాతం పైగా వైకల్యం ఉన్నదని వైద్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, మరియు మొబైల్ ఫోన్ తో హాజరుకావాలని సూచించారు.

**ఈ నెలలో నిర్వహించబడే శిబిరాల షెడ్యూల్ ఈ విధంగా ఉంది:**

నవంబర్ 3: బోయినిపల్లి రైతు వేదిక
నవంబర్ 4: ఇల్లంతకుంట
నవంబర్ 6: చందుర్తి
నవంబర్ 7: వేములవాడ ఎంపీపీ కార్యాలయం
నవంబర్ 10: ముస్తాబాద్ రైతు వేదిక
నవంబర్ 11: సిరిసిల్లలోని సినారే కళా మందిరం

దివ్యాంగులు వీలైనంత తొందరగా సమీపంలోని శిబిరంలో హాజరై ఉపకార వేతనాలు మరియు అవసరమైన ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

**వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9440469338**

## విజయ పథంలో కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సమగ్ర కసరత్తు ప్రారంభం



**చట్టం రామాయంపేట :** త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పి, ప్రజల మద్దతును మరింత బలపరచాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఈ ఎన్నిక రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు బలోపేతానికి కీలకమైన మలుపుగా పరిగణించబడుతోంది. అందుకే అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని నిర్ధారించాలనే సంకల్పంతో కదిలిపోతున్నారు. ప్రాంతీయ నేతలు తమ పరిధిలోని ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా సంప్రదించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు - ధన లక్ష్మి, గృహ లక్ష్మి, రైతు బంధు, చెయ్యూత, వైద్య సేవల విస్తరణ వంటి అంశాలను ప్రజల్లో చర్చనీయాంశంగా మలచి ప్రచారం చేయాలని సూచించారు. అంతేకాక, ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించి, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న స్నేహితులు, బంధువులు, పరిచయస్తులను వ్యక్తిగతంగా సంప్రదించి, కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇంకా వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో, ఈ కీలక దశలో ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుని, బూత్ స్థాయిలో బలమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ప్రజల అభిమానం, కార్యకర్తల తపన, నాయకుల కృషితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరచనుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.

## సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్లో మంగళవారం నాడు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మరియు సొసైటీ చైర్మన్ బాలాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత ప్రభాకర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ సోయా క్వింటాలుకు రూ.5,328/ ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని చెప్పారు.. ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దు అని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు విజ్ఞప్తి చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ బాలాజీ ఎమ్మెల్యే గారిని శాలువాతో సత్కరించారు ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు డెలికేట్ విట్టల్ రెడ్డి, బిచ్కుంద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, బిచ్కుంద పట్టణ అధ్యక్షుడు సాయిల్ సెట్కార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి, సిద్ధప్ప పటేల్, అసద్ అలీ, ఖలీల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, సోపాన్ సార్, దశరత్ స్వామి, సీమ గంగారాం , బందు పటేల్ ,సాయి పటేల్ కలీం అజీమ్, వికాస్ నాయక్, సొసైటీ డైరెక్టర్ చంద్రకాంత్ పటేల్, సొసైటీ వైస్ చైర్మన్ యాదవ్ రావు, సొసైటీ సీఈఓ శ్రావణ్ కుమార్, మార్కెట్ కమిటీ సెక్రటరీ రాజకుమార్, మార్కెట్ సిబ్బంది మరియు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ప్రతి దరఖాస్తులను పరిశీలించి వెంటనే స్పందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బెల్తారోడా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద పటిష్ట గస్తీ

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** తానూరు మండలం బేల్తారోడా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు పటిష్ట గస్తీ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం తానూరు మండలం బేల్తారోడా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అన్ని పంటల కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైనందున పక్క రాష్ట్రం నుంచి పంట అమ్మేందుకు తీసుకువచ్చే అవకాశం ఉన్నందున, నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలన్నారు. చెక్ పోస్ట్ గుండా జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాహనాల వివరాల నమోదుకు సంబంధించి రిజిస్టర్ పరిశీలించారు. తనిఖీ చేసిన వాహనాల వివరాలకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించాలని చెప్పారు. ఈ తనిఖీలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, తహసిల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాదులోని కోకాపేట్‌లో ఉన్న ఆయన నివాసానికి సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కన్వెన్షన్ జనరల్ సెక్రటరీ గుండుకాడి ప్రభాకర్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్, అనిల్ మరియు ఇతర పార్టీ నాయకులు వెళ్లి హరీష్‌రావును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. నాయకులు మాట్లాడుతూ సత్యనారాయణ సేవాస్ఫూర్తి, క్రమశిక్షణ, ప్రజల పట్ల ఉన్న అనురాగం ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## వృక్షశాస్త్రంలో పిహెచ్‌డీకి మదీనా బంగారు పతకం

- డాక్టర్ మెరాజ్ ఫాతిమాకు విశిష్ట గౌరవం



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి వృక్షశాస్త్రంలో పిహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ మెరాజ్ ఫాతిమా, ఆమె అత్యుత్తమ పరిశోధనకు ప్రతిష్టాత్మక మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ ప్రదానం చేసిన "మదీనా బంగారు పతకంతో" సత్కరించబడ్డారు. ప్రొఫెసర్ ఇ. సుజాత మార్గదర్శకత్వంలో "క్యాన్సర్ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక ప్రాధాన్యతతో లాండోల్టియా పంక్టాటా యొక్క ఫైటోకెమికల్ మరియు ఫార్మకోలాజికల్ స్క్రీనింగ్" అనే అంశంపై ఆమె తన డాక్టరల్ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. డాక్టర్ మెరాజ్ ఫాతిమా గత 14 సంవత్సరాలుగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) లో వృక్షశాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారు. ఆమె ఈ పురస్కారం ద్వారా వృక్షశాస్త్ర రంగంలో విశిష్ట కృషికి గుర్తింపును అందుకున్నారు. తన విజయానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సహాధ్యాపకుల మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ మెరాజ్ ఫాతిమా సాధించిన ఈ గౌరవాన్ని సహచరులు, విద్యార్థులు మరియు శ్రేయోభిలాషులు ఆనందంగా జరుపుకుంటున్నారు. వృక్షశాస్త్ర రంగంలో ఆమె నిరంతర పరిశోధనాత్మక కృషి, యువ పరిశోధకులకు ప్రేరణగా నిలుస్తోంది.

## క్రమశిక్షణకు మారుపేరు విజయ్ కుమార్

- జిల్లా విద్యాశాఖ అధికారి ఈ శ్రీనివాస్ రెడ్డి



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే .విజయ్ కుమార్ ఉద్యోగ విరమణ అభినందన సభకు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు జి. తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విజయ్ కుమార్ ప్రభుత్వనూతనోన్నత పాఠశాల మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యానీగా క్రమశిక్షణతో అంకితభావంతో పని చేశారన్నారు .33 సంవత్సరాలుగా విద్యారంగానికి విశేష సేవలందించారన్నారు .ఏ పని చెప్పినా ఓర్పుతో, నేర్పుతో చాలా చిత్తశుద్ధితో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు కానీ ,ఉపాధ్యాయుల శిక్షణ సమావేశాలు కానీ విజయవంతంగా పూర్తి చేసి విద్యారంగానికి మేలు చేశారన్నారు .ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి. అభినందన సభలో విజయ్ కుమార్ సార్ కుటుంబ సభ్యులు, నూతనోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటరమణ, శ్రీనివాస్, శ్రీదేవి, నరసింహారెడ్డి, రాజ్ కుమార్, గోవర్ధన్, వజ్రమ్మ, సాగర్, కనకయ్య, జ్యోత్స్న ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతాదేవి, ధర్మాజీపేట ఉన్నత ప్రధానోపాధ్యాయులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సదర్ సయ్యాట



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలోని 17వ వార్డు వివేకానంద కాలనీ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సయ్యాట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హర్యానా రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన దున్నలు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. యాదవ సంఘం నాయకులు, కుల సంఘ సభ్యులు, పట్టణ కౌన్సిలర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. యాదవ సంఘం యువ అధ్యక్షులుగా దాసరి నరేష్ యాదవ్, దాసరి పరమేష్ యాదవ్, సమన్వయం వహించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో గొల్ల సుద్దుల ఆటలు, మహిళల నాట్య ప్రదర్శనలు, సదర్ సయ్యాటలో భాగంగా జరిగిన ఆటపాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రధాన అతిథిగా వంగ రాజేశ్వర్ రెడ్డి హాజరై సాంస్కృతిక వైభవాన్ని అభినందించారు. కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని సందడిని మరింత పెంచారు.

## మానవత్వం చాటుకున్న మోహన్



**చట్టం రామాయంపేట :** ఇటీవల పరమపదించిన కాంగ్రెస్ క్రియాశీలక కార్యకర్త బక్కయ్య గారి భార్గవ్ మరణించాడు కాబట్టి వారి కుటుంబ సభ్యులకు లీలా గ్రూప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు అయిన మోహన్ రూపాయలు 5000 ఆర్థిక సాయం చేసి వారి కుటుంబం ఎల్లవేళలా బాగుండాలని ఆయన ఆశీర్వదించి వెళ్ళాడు, భార్గవ్ యొక్క ఆత్మకు శాంతి కలగాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ వగ్గు, ఇప్ప రవితేజ సురేష్ నాయక్, సురేందర్, ఎర్రం భూమ లింగం తదితరులు హాజరయ్యారు.

# మత్స్యకారుల సంక్షేమం దిశగా చేప పిల్లల పంపిణీ

- **ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఫల ప్రదమవుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి**



**చట్టం, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** – తెలంగాణ రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం విస్తృతంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, క్రీడా, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. సోమవారం ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ...మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలలో భాగంగా చేప పిల్లల పంపిణీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇందుకోసం రూ.122.22 కోట్ల రూపాయలు కేటాయించి, 83.86 కోట్ల చేప పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా 26,357 నీటి వనరులలో వదిలే ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని ఆ ప్రణాళిక ప్రకారమే చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అభియోగాలకు ఆస్కారం లేకుండా ప్రక్రియ సాగాలని, 'టి మత్స్య యాప్' ద్వారా ప్రతి రోజు వివరాలను నవీకరించాలని ఆదేశించారు.ఈ నెల 20వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 7 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాలు జరపాలని సూచించారు.జిల్లాల వారీగా చేపల రిటైల్ మార్కెట్ల ఏర్పాటు కోసం అనువైన స్థలాలను గుర్తించి, మత్స్యకారులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ...2025-26 సంవత్సరానికి గాను 167.21 లక్షల చేప పిల్లలు పెంచే ప్రతిపాదన సిద్ధం చేశాము. జిల్లాలో 892 చెరువులు ఉన్నాయి. మత్స్యకారుల సంక్షేమం దిశగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చేప పిల్లల పంపిణీకి సంబంధించి కమిటీలు ఏర్పాటు చేసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి పూర్ణిమాసింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్

- **బీర్కూరు మండలంలో ధర్నా – దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు**



**చట్టం న్యూస్ బాన్సువాడ :** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'ఆపరేషన్ సిందూర్' వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలు భారత సైన్యాన్ని అవమానించేలా ఉండటమే కాకుండా, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టే భారత జవాన్ల గౌరవాన్ని దిగజార్చే హక్కు సీఎం రేవంత్‌కు లేదని తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో బీర్కూరు మండల బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ నాయకులు మాట్లాడుతూ, "భారత సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడిన సీఎం వెంటనే ప్రజలకు, సైనికులకు క్షమాపణ చెప్పాలి. దేశ భద్రత, జవాన్ల త్యాగాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అనైతికం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూరు మండల అధ్యక్షులు నాగేళ్ల సాయికిరణ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేశ్వర్, బొంతల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చేపూరి హనుమాన్లు, నూకల రాము, వడ్ల బసవరాజ్, యువ మోర్చా అధ్యక్షులు కొట్టే వినేష్, సీనియర్ నాయకులు బీరుగొండ, పండరి, కార్యకర్తలు ప్రవీణ్, చైనాపురం బసవరాజ్, ఆవారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ నుండి శబరిమలైకు అయ్యప్ప భక్తుల పాదయాత్ర ప్రారంభం



**చట్టం న్యూస్, బాన్సువాడ :** బాన్సువాడ పట్టణ కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం శబరిమలై దర్శనం కోసం బయల్దేరుతున్న అయ్యప్ప భక్తుల పాదయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరై, జెండాను ఊపి పాదయాత్రికులను శోభాయాత్రగా సాగనంపారు. అయితే ఆలయంలో ముందుగా అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి భక్తుల ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం పూజారులు ఆశీర్వచనాలు అందించారు. బాన్సువాడ పట్టణానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, గురు స్వాములు, అయ్యప్ప భక్తులు ఎంతో ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపేటలో పోలీస్ కళాబృందం అవగాహన



**చట్టం న్యూస్ బాన్సువాడ :** నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థుల్లో అప్రమత్తత పెంపొందించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డిపేట సీఐ రాజారెడ్డి సూచనలతో జిల్లా పోలీస్ కళాబృందం విద్యార్థులకు ప్రేమ మోసాలు, బాల్యవివాహాలు, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించింది.షీ టీమ్స్ సభ్యులు పీసీ శ్రీశైలం, డబ్ల్యూపిసి సుప్రజ మాట్లాడి, సోషల్ మీడియా వలలో పడకూడదని సూచించారు. తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, వీడియో కాల్స్, ఫోటోలు పంపడం భారీ మోసాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. అత్యవసర సమయంలో DIAL 100, సైబర్ మోసాలపై 1930, షీటీమ్స్ హెల్ప్ లైన్ 8712686094కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. కళాబృందం ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, ఉక్కు శేషారావు, పీసీ ప్రభాకర్, సాయిలు పాటలు, నాటికల రూపంలో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి విద్యార్థులను ఆకట్టుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, గంజాయిడ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని వివరించారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ మనోహర్ రావు, ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని పోలీస్ శాఖ ప్రయత్నాలను అభినందించారు.

## అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



**చట్టం రామాయంపేట :** అకాల వర్షాలు ఏ సమయంలో సమీపిస్తున్నయో! అర్థం కావడం లేదని రైతులు అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. నిజాంపేట మండలంలో మాట్లాడుతూ.. రైతులు ఆరుకాలం కష్టించి పండించిన పంట కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోశారాని కాబట్టి అకాల వర్షాలకు ధాన్యాన్ని కాపాడుకోవాలన్నారు. రైతులు టార్పోలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని సూచించారు.

## జూబ్లీహిల్స్ ప్రజల హృదయాల్లో కాంగ్రెస్ జెండా ఎగురుతోంది : ఎమ్మెల్యే జారే



**చట్టం అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజల హృదయాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ మీదే విశ్వాసం ఉందన్నారు. ప్రజల అభీష్టం కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉందన్నారు. అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి అందించిన సేవలు ఈ ఎన్నికల్లో ఉత్తమ ఫలిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వినియోగదారుల దినోత్సవం విజయవంతం



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో చేగుంట, నిజాంపేట ,రామాయంపేట, నార్సింగి మండలాలకు కలిపి రామాయంపేట పట్టణంలో సబ్స్టేషన్లో ఏర్పాటుచేసిన వినియోగదారుల ఫిర్యాదుల శిబిరం ఏ డి ఈ ఆదయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా రామాయంపేట 6, నిజాంపేట 1, నార్సింగి 4, చేగుంట 1 ఫిర్యాదులు వచ్చాయి, ఈ మేరకు ఏ డి ఈ ఆదయ్య మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను వెంటనే సాధ్యమైనంత మేరకు తొందరగా పరిష్కారమయ్యే దిశగా వినియోగదారులకు ఊరట కల్పిస్తామని, వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లో రూపాయి ఖర్చు లేకుండా మేమే వారి దగ్గరికి వెళ్లి వారి ఇబ్బందులను మా డిపార్ట్మెంట్ వారు చేస్తారని, వారికి ఎటువంటి లంచం గానీ ఇవ్వరాదని, ఇవ్వడం కూడా నేరమని ఆయన ఒక ప్రశ్నకు బదిలించారు. అలాగే ఎవరికి ఏ పని ఉన్న నేరుగా వచ్చి ఆఫీసులో వివిధ రకాల పనులను బట్టి వివిధ రకాల సెక్షన్లలో పనులు చేయించుకోవాలని అందుకు మా నుండి ఎల్లవేళలా సహకారం ఉంటుందని ఆయన తెలిపారు.

## రెండో వార్డులో రోడ్డు పనుల పునఃప్రారంభం ప్రజల్లో హర్షం



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి మున్సిపాలిటీ రెండవ వార్డులో రోడ్డు అభివృద్ధి పనులు సోమవారం పునఃప్రారంభం అయ్యాయి. గత కొంతకాలంగా నిలిచిపోయిన పనులపై రెండో వార్డ్ మాజీ కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే మదన్ మోహన్ ను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మదన్మోహన్ సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించి పనులు ప్రారంభం చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, పాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో ప్రాణాల కోసం తల్లి మొర

- **లివర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడు విగ్నేష్‌కు ఆర్థిక సహాయం అవసరం**



**చట్టం ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన గడప మాధవి - బాలకృష్ణ దంపతులు కష్టసమయంలో ఆర్థిక సహాయం కోసం దాతలను వేడుకుంటున్నారు. వీరి కొడుకు విగ్నేష్ (6వ తరగతి, మహర్షి స్కూల్) తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండవసారి లివర్ ఆపరేషన్ బుధవారం రాత్రి ముస్తాబాద్‌లోని పీపుల్స్ ఆసుపత్రిలో జరగనుంది. ఈ కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉండటంతో చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితి నెలకొంది. తండ్రి బాలకృష్ణ ఐడియా కంపెనీలో సిమ్ కార్డులు అమ్ముతూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. రోజువారీ కూలీ ఆధారంగా జీవనం సాగించే ఈ కుటుంబం వద్ద డబ్బులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విగ్నేష్‌కు చిన్ననాటి నుంచే లివర్ సమస్యలు ఉన్నాయి. మూడు సంవత్సరాల వయసులో మొదటి లివర్ సర్జరీ చేయించగా, అప్పట్లో సుమారు ₹8 లక్షలు అప్పుగా తెచ్చి చికిత్స చేయించారు. ఆ అప్పులలో ఇప్పటికీ ₹5 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని మాధవి కన్నీరుమున్నీరుగా చెబుతోంది. ఇప్పుడు మళ్లీ లివర్ సంబంధిత సమస్యలు తీవ్రమవడంతో వైద్యులు వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. ఈ సర్జరీకి సుమారు ₹3 లక్షల పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఇక తల్లిదండ్రులు లేకుండా కష్టాల మధ్య బతుకుతున్న ఈ దంపతులు గతంలో ప్రభుత్వ ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నారు. ప్రస్తుతం EMIలు, పాత అప్పులు, వైద్య ఖర్చులు అన్నీ మోపుగా మారాయి. "మా కొడుకు ప్రాణాలు దయచేసి కాపాడండి" అని మాధవి కన్నీటి గళంతో దాతలకు విజ్ఞప్తి చేస్తున్నారు. విగ్నేష్ ప్రాణాలను రక్షించేందుకు సాయం చేయదలచిన దాతలు ఫోన్‌పే నెంబర్ 9133934308 కు నేరుగా ఆర్థిక సహాయం అందించవచ్చు.

## పంట నష్ట పరిహారం ఎకరాకు 30 వేలు ఇవ్వాలి

- **పేపర్ స్టేట్మెంట్ లకే పరిమితమైన రేవంత్ రెడ్డి హామీలు**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుక్కపూర్ గ్రామం, ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మరియు లింగరాజుపల్లి గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చ అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు రైతుల సమస్యలను సమీక్షించి, ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా స్పందించారు. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించిందని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం ₹30,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ప్రకటించిన ఎకరాకు ₹10,000 పరిహారం హామీ కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ఈ హామీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన రాజకీయ ప్రకటన తప్ప, ప్రస్తుత ప్రభుత్వానికి రైతుల పట్ల నిజమైన చింత లేదని మండిపడ్డారు. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అలాగే ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిగా చెల్లించాలని కోరారు. వడ్లు మొలక వచ్చినా లేదా తేమ శాతం పెరిగినా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా, రైతులను ఆదుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మొత్తాన్ని కూడా రైతులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు 10 కిలోల కటింగ్ జరుగుతోందని, దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. ఈ కటింగ్ ద్వారా సుమారు ₹100 కోట్లు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, రైతులు మరియు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు ₹50,000 నష్టపరిహారం ఇవ్వాలి

- **బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ డిమాండ్**



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** ఇటీవలి వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50,000 చొప్పున నష్టపరిహారం అందించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ, రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు భారీ వర్షాల వల్ల పూర్తిగా నాశనమయ్యాయని, రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తక్షణమే నష్టపరిహారం ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఉద్యమానికి సిద్ధమవుతుందని ఆయన హెచ్చరించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, బహుజన సమాజానికి న్యాయం చేయడం పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అలాగే, బీజేపీ మరియు కాంగ్రెస్ పార్టీలు బీసీ వర్గాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా ఇన్‌చార్జీలు దేగల వెంకటేశ్వర్, గజ్జల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లేశం ముదిరాజ్, జిల్లా కార్యదర్శి జే. రవీందర్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పంగబాబు, మేధోజు మహేష్, మోతె నర్సింలు, అసెంబ్లీ అధ్యక్షులు కొండపలకల సంపత్, పోతారం రాజు, కొమ్ము చంద్రం, వేల్పుల రాజు, నాయకులు కిరణ్, బండ నర్సింలు, స్వామి, కనక ప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు ని పరామర్శించిన నాగుర్ల



**చట్టం పరకాల ;** హైదరాబాద్ లో హరీష్ రావు గారి నివాసంలో... తన తండ్రి గారు... తన్నీరు సత్యనారాయణ రావు గారు అకాల మరణం చెందగా.. వారి చిత్రపటానికి నివాళులర్పించి,మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ని, వారి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. వారితో పాటు తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవా రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## బోరబండలో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల ప్రచారం



**చట్టం న్యూస్ బాన్సువాడ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసమై సోమవారం ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ ప్రజలను పలకరిస్తూ, కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పీసీసీ డెలిగేట్ డా. కూనీపూర్ రాజారెడ్డి, కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ రెడ్డి, బాన్సువాడ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నేమాని రాఘవేంద్ర, సీనియర్ నాయకులు ఈర్వంత్ రావు పటేల్, గజ్జల సాయిలు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ సంతోష్ కుమార్‌ను అభినందించిన అధికారులు




**చట్టం / పరకాల ;** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ప్రిన్సిపాల్ గా విధులు నిర్వర్తిస్తున్నటువంటి డాక్టర్ బి. సంతోష్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణ మరియు కళాశాల విద్య కమిషనర్ ఎ.దేవసేన గార్లు అభినందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తొర్రూరులో ప్రిన్సిపల్ గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో గేల్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ వారి సహకారంతో నాలుగు కోట్లు మంజూరు చేయించి నూతన కళాశాల భవనాన్ని నిర్మించినందుకు అలాగే ప్రస్తుతం పరకాలలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కృషి చేసినందుకు మరియు డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెంచడంతోపాటు వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నందుకుగాను అక్టోబర్ 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ సమావేశంలో డాక్టర్ బి. సంతోష్ కుమార్ ను అధికారులు ప్రశంసించి, అభినందించారు. అంతేకాకుండా కళాశాల అభివృద్ధికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే మా దృష్టికి తీసుకువచ్చినట్లైతే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినారని ప్రిన్సిపల్ డాక్టర్ బి. సంతోష్ కుమార్ తెలిపారు.

## హరీష్ రావు ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



**చట్టం / పరకాల ;** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవలే మృతిచెందగా హైదరాబాద్ లోని వారి స్వగృహంలో వారిని పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

## వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం /పరకాల ;** సంగెం మండల కేంద్రంలో మరియు బిక్కోజి నాయక్ తండ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న మరియు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నా దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. ఏ గ్రేడ్‌కు రూ. 2389, కామన్ రకానికి రూ.2369ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయిచర్ ఉండాలి అని అన్నారు. మొక్కజొన్నలకు క్వింటాలకు రూ 2400 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు.నాణ్యత ప్రమాణాలను అనుసరించి వరి & మొక్కజొన్నలకు కనీసం మద్దతు ధర పొందాలని సూచించారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందించేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.అనంతరం బిక్కోజి నాయక్ తండ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరియు విద్యుత్ లైన్లను ప్రారంభించారు.

## వెల్లుట్లపేటలో ఉచిత వైద్య శిబిరం

- **ప్రజల ఆరోగ్యమే లక్ష్యం: కోయ్యాల రాజా గౌడ్**



**చట్టం/ ఎల్లారెడ్డి :** వెల్లుట్లపేట గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ మండల బిసి సెల్ ఉపాధ్యక్షుడు కోయ్యాల రాజా గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ లోని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో నిర్వహించిన ఈ క్యాంపులో బీపీ, షుగర్, జ్వరం, దగ్గు, దమ్ము, మోకాళ్ల నొప్పులు, తలనొప్పి, వంటి సీజనల్ వ్యాధులకు ఉచిత పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. సుమారు 200 మంది గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అలాగే 20 మందికి హైదరాబాద్‌లో ఎం.ఆర్.ఐ. పరీక్షలు, 12 మందికి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులు కోయ్యాల రాజా గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి సిబ్బంది, గ్రామ కాంగ్రెస్ నాయకులు పెంట అంజయ్య, కరే చెవుల రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

CHATTAM NEWS

నిజామాబాద్
మంగళవారం
04.11.2025



# కృష్ణ నేచురల్ ఫ్యాక్టరీలో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

**చట్టం మద్నూర్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండల కేంద్రంలోని కృష్ణ నేచురల్ ఫ్యాక్టరీ లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI) ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్ రావు సోమవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రైతుల ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది. ఒక క్వింటాల్ పత్తిని 78,110కు కొనుగోలు చేస్తోంది" అని తెలిపారు. రైతులకు న్యాయమైన ధర, పారదర్శక కొనుగోలు, సకాలంలో బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి రైతు ధైర్యంగా పత్తి విక్రయించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా మార్కెట్ కమిటీ అధికారిణి, మార్కెట్ చైర్మన్ సౌజన్య రమేష్ ఓబీసీ రాష్ట్ర నాయకుడు సాయి పటేల్, మార్కెట్ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, సింగిల్ విండో చైర్మన్ సీనూ పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు సాయిలు, రమేష్ వటనల్ వార్, మీర్జాపూర్ ఆలయ చైర్మన్ రామ్ పటేల్,కొంద గంగాధర్,హన్మాండ్లు స్వామి, గోపి,నగేష్ పటేల్,బాలు షిండే ఇక ఫ్యాక్టరీ యాజమాని రాజేష్ కాకనీ, మార్కెట్ కమిటీ సెక్రెటరీ, రాజ్ కుమార్ మార్కెట్ కమిటీ అధికారులు సిబ్బంది మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## అభివృద్ధి పనుల్లో వేగం నాణ్యత పై అధికారుల పర్యవేక్షణ

**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పనుల నిర్మాణంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. పనులలో భాగంగా బేస్ మెంట్ స్థాయిలో స్లాబ్ వేయడం పూర్తయింది. పనులు నాణ్యతతో సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. పురోగతి వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బింగి రామకృష్ణ తెలిపారు. నిర్మాణాల వేగాన్ని స్థానిక ప్రజలు మెచ్చుకుంటున్నారు.



## సైబర్ నేరాల పట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలి... ఎస్సై. కళ్యాణి



**చట్టం ధర్పల్లి;** ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థినిలు ప్రముత్తంగా ఉండాలని, ధర్పల్లి ఎస్సై ఎం. కళ్యాణి కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు సూచించారు. సోమవారం పాఠశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలు, కెరీర్ గైడెన్స్, ట్రాఫిక్ రూల్స్, తదితర వాటిపై అవగాహన కల్పిస్తూ, వాట్సాప్ ,ఫేస్బుక్ ,ఇన్స్టాగ్రామ్, లలో తమ డిపి ని పెట్టుకోవద్దని సూచించారు. పాఠశాలలో శ్రద్ధతో చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని ,పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ ఆకాంక్షించారు. విద్యార్థులకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా పోలీసులను ఆశ్రయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ఎల్లమ్మ గుడి దేవాలయానికి లక్ష 10 వేల రూపాయల విరాళం

**చట్టం న్యూస్, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్ గ్రామంలో నిర్మించా తలపెట్టిన శ్రీ ఎల్లమ్మ దేవి దేవాలయం నిర్మాణానికి గాను ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన హనుమంతరావు, 60 వేల రూపాయలు విరాళం, అదేవిధంగా మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షులు, శివ్వంపేట మండల పరిషత్తు మాజీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, 50వేల రూపాయల విరాళం దేవాలయం నిర్వాహకులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అధ్యక్షులు కల్లూరు హరికృష్ణ, మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన హనుమంతరావు, మాట్లాడుతూ శ్రీ ఎల్లమ్మ దేవి దేవాలయాన్ని నిర్మించడం గ్రామస్తుల అదృష్టమని వారు అభిప్రాయపడ్డారు. ఏదుల్లా పూర్ గ్రామం మరింత అభివృద్ధి కోసం తమ శాసశక్తుల కృషి చేస్తామని వారు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామస్తులు సహకారంతో ఏ దుల్లాపూర్ గ్రామపంచాయతీని మరింత అభివృద్ధి పరచడమే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరి ముత్యాల పటేల్, భూ రెడ్డి శ్రీనివాస్, భూ రెడ్డి వెంకట్ రెడ్డి, భూ రెడ్డి సుదర్శన్ రెడ్డి, భూ రెడ్డి దేవేందర్ రెడ్డి, భూరెడ్డి అంజిరెడ్డి, ఎడ్ల జయపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## ఉచిత సేవల కోసమే న్యాయ సేవా కేంద్రాలు



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మేట్ పల్లి పేద ప్రజలు, బాధితుల కోసమే ఉచిత న్యాయ సేవా కేంద్రాలు ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి మరియు మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ డి. నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం లీగల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ గదిలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డబ్బులు చెల్లించి న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేనివారికి మండల లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసే సౌకర్యం ఉందన్నారు. పోలీస్ స్టేషన్ లో న్యాయం జరగని పక్షంలో కూడా బాధితులు కేంద్రాన్ని సంప్రదించి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమాలు కూడా లీగల్ సర్వీసెస్ కేంద్రాల ద్వారే జరుగుతాయాని, ఈ నెల 15 రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జరిగే లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజ శేఖర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హఫీజ్, మీడియాషన్ సభ్యులు మచ్చ రమణ మూర్తి, చాప వందన, ఒజ్జల శ్రీనివాస్, తునికి వేణుగోపాల్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తాసిల్దార్‌కు వినతి



**చట్టం ధర్పల్లి;** తెలంగాణ రాష్ట్రంలో 65% ఉన్న బీసీలకు ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ,సోమవారం ధర్పల్లి మండల బిసి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తాసిల్దార్ శాంతా కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ 15% ఉన్న అగ్రవర్ణాల కులాల వారు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని, రిజర్వేషన్ లేక బీసీలు రాజకీయంగా ఎదిగ లేకపోతున్నారని అన్నారు. వెంటనే చట్టబద్ధంగా నలభై రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. నరసయ్య, సురేందర్ గౌడ్, వి. బాలయ్య, నవీన్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అందరి ఆదరాభిమానాలు పొందిన జాటోత్ అమృతమ్మ

**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామం లో నివాసం ఉంటున్న జాటోతు అమృతమ్మ (105) ఇటీవల మరణించారు వారి భర్త జాటోతో మన్నా నాయక్ ఈ దంపతులకు నలుగురు కుమారులు ఒక కుమార్తె వీరికి 12 మంది మనవలు పదిమంది మన వరాలు వున్నారు అమృతమ్మ వారి భర్త చనిపోయి 28 సంవత్సరాలు అయిన . అప్పటినుండి ఇప్పటివరకు తను తన పని తనే చేసుకుంటూ ఎంతో దృఢంగా ఉంటూ కుటుంబ సభ్యులందరికీ మంచి చెడులు చెబుతూ ఉండేది నవంబర్ 1న2025 తను పరమపదించడం జరిగింది. తమ నానమ్మ మరణం ఎంతో భాసించిందని మనుమడు రతన్ సింగ్ కన్నీటి పర్యంతం అయ్యారు మా కుటుంబ విలువలు కాపాడుతూ అందరి బాగోగులు చూస్తూ అందరి తలలో నాలుకలా వుండేదని ఎప్పుడు సంతోషంగా ఉల్లాసంగా వుండేదని ప్రతి ఒక్కరినీ ప్రేమ పూర్వకంగా పలకరించేదని తాత తో పూర్వపు రోజుల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేదని సుమారు 105 ఏళ్లు జీవించడం పూర్వ జన్మ సుకృతం అన్నారు వారికి మనుమడు గా పుట్టడం నా అదృష్టం అన్నారు వారితో ఉన్న జ్ఞాపకాలు నెమరువేసుకొని వెళ్లిపోయావ నానమ్మ అంటూ విషాద వదనంతో నిట్టూర్చారు మరో జన్మ ఉంటె మళ్లీ మమనడు గా పుడతా అని అన్నారు అమృతమ్మ మరణంతో గ్రామం అంతా శోక సంద్రం లో మునిగి పోయింది వారి అంత్యక్రియాలకు బంధు మిత్రులు పెద్ద ఎత్తున తరలి వచ్చి వారి పార్థివ దేహం మీద పూలు వేశారు. వారి అంతిమ యాత్రలో బంధువులు మిత్రులు ఎక్కి ఎక్కి ఏడ్చి సాగ నంపారు వీరికి కుమారులు దివంగత బాలు నాయక్ కోడలు కమలమ్మ కరణ్ సింగ్ కోడలు కైలమ్మ బలరాం నాయక్ కోడలు రాధ సమ్ములాల్ కోడలు భాగ్యలక్ష్మి కూతురు దివంగత చాందీ బాయి అల్లుడు భోజి నాయక్ వీరి అంత్య క్రియల్లో మాజీ ఎం పి సీతారాం నాయక్ మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి హరీష్ నాయక్ పోరిక ప్రేమ్ సింగ్ నవరాం నాయక్ రాజారాం నాయక్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మీద ఉన్న చిత్తశుద్ధి రేవంత్ రెడ్డికి విద్యార్థుల భవిష్యత్తు మీద లేదు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ లను వెంటనే విడుదల చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన యుఎస్ఎఫ్ఐ నాయకులు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఎనిమిది వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి పుట్ల హేమంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీ హిల్స్ ఎన్నికపై ఉన్న చిత్తశుద్ధి, తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల మీద లేకపోవడం సిగ్గుచేటు. కాలేజీలు మూసివేసి అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కళాశాలలు. గతంలోనే తెలంగాణలోని ప్రైవేటు ఇంటర్ మరియు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పుడు మొదటి విడతగా 600 కోట్లను విడుదల చేస్తానని చెప్పి మాట తప్పింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పటికి కూడా ఆ మాట నిలబెట్టుకోకపోవడం వల్లనే ఈరోజు రాష్ట్రంలో చాలా కళాశాలలు స్వచ్ఛందంగా బందు చేశాయి.




అయినా కూడా ఈ రేవంత్ రెడ్డి వారితో మాట్లాడిన పాపాన పోలేదు. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడానికి రోడ్ షోలు నిర్వహించడానికి సమయం ఉంది కానీ తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం సమయం కేటాయించలేదు. రాష్ట్రాన్ని నడపడం చేతకాకపోతే రాజీనామా చేయాలి గాని ఇలా రాష్ట్ర ప్రజల భవిష్యత్తును నాశనం చేస్తారా అని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయకపోతే కళాశాలల యాజమాన్యాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, వరుణ్, వినయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించిన మాజీ జడ్పిటిసి సభ్యులు మహేష్ గుప్తా

**చట్టం న్యూస్ శివ్వంపేట :** చాలా రోజుల నుండి తమ గిరిజన తండాలో నీటి సమస్య ఉందని తాండవాసులు అడిగిన వెంటనే కాదనకుండా ప్రముఖ సంఘ సేవకులు, శివ్వంపేట మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు పబ్బ మహేష్ గుప్తా సోమవారం నాడు మండల పరిధిలోని సీతారాం గిరిజన తండాకు వెళ్లి అక్కడే ఉండి తన సొంత డబ్బులతో నీటి బోరును త్రవించడం జరిగింది. పుష్కలంగా నీరు రావడం జరిగింది. ఈ సందర్భంగా తాండావాసులు సంతోషం వ్యక్తం చేస్తూ అడిగిన వెంటనే బోరు త్రవ్వించి మోటార్ను కూడా ఏర్పాటు కల్పించడం పట్ల తమకు నీటి సమస్య పరిష్కారం అయ్యిందని తాండవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ మహేష్ గుప్తాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేష్ గుప్తా మాట్లాడుతూ మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా అక్కడి స్థానికులు తమకు నీటి సమస్య ఉందని తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా బోర్లు వేయించి నీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది, ఇప్పటివరకు దాదాపు చాలా గ్రామాలు



మంచివి బోర్లు త్రవిజయం జరిగిందని మహేష్ గుప్తా గుర్తు చేశారు. ఏ గ్రామంలో కూడా స్థానికులకు నీటి సమస్యఉండకూడదని తన తన ప్రధాన ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్, మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి, నాయకులు చేరివిరాల అశోక్ కుమార్ గుప్తా, బాలేష్, సుమన్, రవీందర్ గౌడ్, రాజేందర్ నాయక్, శ్రీనివాస్ ,చందర్, విజయ్, మహేందర్, అశోక్, మాలోత్ రాజు, అనిత ,హోలీ, లక్ష్మీ అనిత, సక్కుబాయి, తదితరులు ఉన్నారు,

## పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన

**చట్టం, నవీపేట్ :** నిజాంబాద్ జిల్లా నవపేట్ మండలం యాంచ గ్రామంలో సోమవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువులతల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కార్తీక మాసం సందర్భంగా యంచ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల యందు సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది. ఈ యొక్క విగ్రహాన్ని శ్రీ ఓం ఆదిశక్తి ఆశ్రమం ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శ్రీ ఓం స్వర్ణకమలక్ష్మి అమ్మవారు దాతగా ఇవ్వడం జరిగింది. పాఠశాల అధ్యాపకులు గ్రామస్తుల సహకారంతో ప్రత్యేక హోమం నిర్వహించి, అభిషేకం, అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ముందుగా పాఠశాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామస్తులతో కలిసి జగదాద్రి దేవి ఆలయానికి వెళ్లి అక్కడ అమ్మవారి చేతుల మీదుగా వీడిసి అధ్యక్షులు సాయిలు, వేదమంత్రాల మధ్య భాజబజాంత్రీలతో సరస్వతీ విగ్రహాన్ని పెట్టీ, అక్కడ పాఠశాల సిబ్బందితో గ్రామస్తులు వేద పండితుల వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేపట్టి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. దీనితో హర్షం వ్యక్తం చేస్తూ కొందరు గ్రామస్తులు మాట్లాడుతూ... పాఠశాలలో ప్రార్ధన చేసేటప్పుడు చదువుల తల్లి సరస్వతి అమ్మవారిని తలుచుకుంటూ ప్రార్ధన చేసి అనంతరం ప్రతి ఒక్కరు



తమ వంతుగా భక్తి భావనతో టెంకాయ కొట్టి పూజలు చేసి సనాతన సంస్కృతిని కాపాడేందుకు, విద్యార్థులకు సాంప్రదాయ ధర్మాన్ని అలవాచుకోవడానికి ఇది ఒక మంచి వినూత్న రీతిలో అలవాటు చేసుకుంటారని విగ్రహం పెట్టడం జరిగిందని తెలిపారు. సరస్వతి మాత జై జై కారాల మధ్య శోభాయాత్రగా పాఠశాలకు వచ్చి, ఆలయ అర్చకులు ప్రతిష్టాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీడిసి అధ్యక్షులు సాయిలు తాజా మాజీ సర్పంచ్ ప్రవీణ్ ఎస్ఎంసి మాజీ చైర్మన్ తుకారి ప్రవీణ్ ఇరిగేషన్ మాజీ చైర్మన్ లింగం గౌడ్ గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం

- **శ్రీ నేతి మహేశ్వర్ గురుస్వామి అన్నదాన ప్రభువు**

**చట్టం న్యూస్, శివ్వంపేట :** తెలంగాణ రాష్ట్రంలోనే మరో శబరిమలై గా ప్రసిద్ధిగాంచిన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో గల జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీ అయ్యప్ప దేవాలయంలో ప్రతి ఏటా విధంగానే ఈ సంవత్సరం కూడా నవంబర్ 16 నుండి జనవరి 11వ తేదీ వరకు శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయానికి వచ్చే తెలంగాణ ప్రాంతంలోని మాలాధారణ పొందిన అయ్యప్ప స్వాములకు యధావిధిగా అన్నదాన వితరణ చేస్తామని తూప్రాన్ అయ్యప్ప స్వామి దేవాలయం గురుస్వామి చిన్నలింగు శ్రీనివాస్ గౌడ్, బజారు రూపేష్ గురుస్వామి విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు, తూప్రాన్ లోని అయ్యప్ప స్వామి దేవాలయం ధరించుకుంటున్న మాలాధారణ పొందిన అయ్యప్ప స్వాములకు తప్పకుండా అన్నదాన వితరణ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ దేవాలయంలో హైదరాబాద్ అమీర్పేట నగరంలో నివాసముంటున్న నేతి మహేశ్వర్ గుప్తా గురుస్వామి ప్రతి సంవత్సరం వేలాదిమంది అయ్యప్ప స్వాములకు అన్నదాన ప్రభు గా నిలుస్తున్నారని వారు గుర్తు చేశారు. తూప్రాన్ అయ్యప్ప స్వామి దేవాలయం జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ప్రతిరోజు వందలాదిగా అయ్యప్ప స్వాములు స్వామివారి దర్శించుకుంటున్నారని వారు తెలిపారు. నవంబర్ 16వ తేదీ నుండి నిత్య పూజలు యధావిధిగా కొనసాగుతాయని వేలాదిగా అయ్యప్ప స్వాములు పూజలో పాల్గొంటారని వారు అన్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతానికి చెందిన 9 మంది 18వ మాలాధారణ పొందిన అయ్యప్ప స్వాములు 18వ మహా పడిపూజలు నిర్వహిస్తారని వారు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తున్న అయ్యప్ప స్వాములకు విడిది ఏర్పాటు కూడా ఇక్కడ కల్పిస్తామని వారు వివరించారు.

## బాన్సువాడ ఎమ్మెల్యే అనర్హత ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలసిన రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు**

**చట్టం న్యూస్ బాన్సువాడ :** బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(1)(a) ప్రకారం అనర్హతకు గురికావాల్సిన పరిస్థితి నెలకొన్నందున, ఈ అంశంపై తక్షణ చర్యలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌ను రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కొత్త సోమశేఖర రావు కోరారు. ఈ మేరకు సోమశేఖర రావు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈవో సి. సుధర్శన్ రెడ్డి, ఐఏఎస్ ని వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్టికల్ 192 ప్రకారం, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ద్వారా తెలంగాణ గవర్నర్‌కు సూచనలు పంపి అనర్హతపై నిర్ణయం తీసుకునే ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని ఆయన డిమాండ్ చేసినట్లు సమాచారం. రాష్ట్ర రాజ్యాంగ ప్రతిష్టను కాపాడటమే కాకుండా ప్రజాస్వామ్య నిబంధనలు నిలబెట్టే దిశగా ఈ చర్య అత్యవసరమని సోమశేఖర రావు పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించాలంటే చట్టబద్ధమైన చర్యలు వెంటనే తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు.



## గౌడ కులస్తుల కళ్ళు వ్యాపారంతో ఇతర కులస్తులకు సంబంధం లేదు

- **లైసెన్సులు కావాలని ఎక్సైస్ అధికారులను బెదిరించడం సమంజసం కాదు**
- **నూతన గౌడ సంఘం అధ్యక్షులు గైనిబైటి ప్రవీణ్ గౌడ్**



**చట్టం న్యూస్, శివ్వంపేట :** గ్రామాలలో నీ వారి సొంత భూములలో ఈతవనాలు పెంచుకొని ఈత చెట్లు పెద్దయ్యాక కల్లు వ్యాపారం చేస్తూ గౌడ కులస్తుల పొట్టన కొడుతున్నారని, ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి ఏళ్ల సంవత్సరం ఎప్పుడు జరగలేదని మెదక్ జిల్లా చెంది గ్రామానికి చెందిన నూతన గౌడ సంఘం అధ్యక్షులు గైనిభైటి ప్రవీణ్ గౌడ్, ఆరోపించారు. శివ్వంపేట పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో కల్లు వ్యాపారం చేసుకుని జీవనం గడిపేవారు కేవలం గౌడ కులస్తులేనని ప్రవీణ్ గౌడ్, అన్నారు. ఇటీవల కాలంలో మండలంలోని ఆయా గ్రామాలలో ఇతర కులస్తులు ఈతమానాలు పెంచుకొని మాకు కూడా లైసెన్సులు కావాలని ఎక్సైజ్ శాఖ అధికారుల దగ్గరికి వెళ్లి మర్యాద లేకుండా మాట్లాడుతూ లైసెన్స్ లు అడగడం ఇంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గౌడ కులస్తులను దూరం చేయాలని ప్రయత్నాలు చేస్తే అన్ని గ్రామాలకు గౌడ్ కులస్తులు ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రవీణ్ గౌడ్, హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా కేవలం అర్హులైన గౌడ కులస్తులకు లైసెన్సులు ఇవ్వాలని ఇతర కులస్తులకు ఎట్టి పరిస్థితుల్లో కూడా కళ్ళు అమ్మడానికి లైసెన్సులు ఇవ్వకూడదని ప్రవీణ్ గౌడ్ స్పష్టం చేశారు. ఇతర కులస్తులకు కల్లు వ్యాపారాలకు లైసెన్సులు ఇస్తే గౌడ కులస్తుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇతర కులస్తులు కళ్ళు వ్యాపారం విషయంలో వారి పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో గ్రామ గ్రామాన వెళ్లి గౌడ కులస్తుల ఏకం చేస్తామని, అవసరమైతే ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని ప్రవీణ్ గౌడ్ అన్నారు. ఆయన వెంట గౌడ సంఘం నాయకులు కుమార్ గౌడ్ లచ్చ గౌడ్ స్వామిగౌడ్ శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పట్టణంలోని పెద్దమ్మ ఆలయం వద్ద తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఆదేశాలతో రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి ఆకుల హన్మాండ్లు ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ... తెలంగాణ రాజ్యాధికార పార్టీని బలోపేతం చేసే దిశలో భాగంగా నియోజకవర్గ, మండలాల, గ్రామాల ప్రాతిపదికన కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అశేష జనవాహిని తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నినదించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కలుపుకొని రాజ్యాధికారం సాధించే దిశా నిర్దేశం చేసిన మల్లన్నతో నడవడానికి ముందుకోస్తున్నాందుకు సంతోషం వ్యక్తం చేశారు. పెద్దమ్మ తల్లి సాక్షిగా పార్టీలో చేరి సేవలు అందించడానికి ముందుకొస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులుగా ఆకుల అంజయ్య, పట్టణ యూత్ విభాగం అధ్యక్షులుగా మారంపెల్లి మధులను నియమిస్తున్నట్లు ఆకుల హన్మాండ్లు తెలిపారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ.. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ ఆకుల హన్మాండ్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నమని పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని, తీన్మార్ మల్లన్నను ముఖ్యమంత్రిగా చూడడమే తమ ధ్యేయంగా పార్టీలో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు జోరిగే రజిత శ్రీనివాస్, మైనారిటీ మండల అధ్యక్షులు అహ్మద్ పాషా, లోలపు సురేష్, గడ్డమీది భూమయ్య, కోలా కృష్ణంరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన






**చట్టం /పరకాల;** పరకాల పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం, శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమానికి గందే సదానందం జగత్ లక్ష్మీ దంపతులు దాతలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ కోమల్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో శివనామ స్మరణతో లక్ష బిల్వార్చన జరిగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో కుంకుమేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మహా రుద్ర యాగ సమితి అధ్యక్షుడు ఎర్ర లక్ష్మణ్, మహా రుద్రయాగ సమితి కన్వీనర్ గంధ రవి, కోకన్వీనర్ ఆముదాల పెల్లి అశోక్, పోచురాజు వెంకట్ రెడ్డి, బండి రాజేష్, అడగని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 17నవంబర్ మహారుద్రయాగ మహోత్సవం

**చట్టం / పరకాల ;** పరకాల పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో కార్తీకమాస మహా రుద్రయాగా మహోత్సవం 17నవంబర్ సోమవారం రోజున ప్రముఖ పండితులు కోమాళ్ళపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మహారుద్రయాగ సమితి సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా రుద్రయాగ సమితి మరియు ఆలయ ధర్మకర్తల మండలి,దాతల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని ఈ యాగంలో ప్రాసాద ప్రదక్షిణ,ఉత్సవ అనుజ్ఞ, ప్రత్యాహ్నికపూజా,గోపూజా, గణేశపూజన,పుణ్యాహవాచ,పంచగవ్యప్రాశన,అగ్ని ప్రతిష్టాపన,మహారుద్రయాగము,మహాపూర్ణాహుతి,మహదాశీర్వచనము,తీర్థ ప్రసాద వితరణ,మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించబడునని పేర్కొన్నారు.

## టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** జిల్లా వ్యవసాయ శాఖ ఫోరంలో టీఎన్జీవోస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. 80 ఏళ్ల చరిత్ర కలిగి ఉద్యోగుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న టీఎన్జీవోస్ సంఘంలో సభ్యత్వం తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉద్యోగులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, కేంద్ర సంఘ బాధ్యులు కె.శివకుమార్, జిల్లా సహా అధ్యక్షుడు చక్రధర్, జిల్లా కోశాధికారి దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షులడు రాజేశ్వర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్, అర్బన్ తాలూకా ఉపాధ్యక్షుడు కిషన్, వ్యవసాయ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి డ్రామాలు బంద్ చెయ్యి

- కాంగ్రెస్ ప్రభుత్వం పని పడతాం
- బీసీ డిక్లరేషన్ పై మొదటి సభ కామారెడ్డి లోనే
- బీసీలకు జరుగుతున్న అన్యాలపై వివరణ కోసమే
- బీసీ సంఘాల నాయకులు ముందుకు వచ్చే పోరాడాలి
- బీసీ ఎంపీలను రోడ్లపై తిరగనివ్వం



(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) రాష్ట్రవ్యాప్తంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుపై 33 జిల్లాలలో సమావేశాలు నిర్వహిస్తామని 42 శాతం రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరజ్ లు తెలిపారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ ఈనెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభ లోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింద ని కామారెడ్డి లోనే బిసి డిక్లరేషన్ చేసినందున 42 శాతం రిజర్వేషన్ ప్రారంభ సభ కు కామారెడ్డిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సభ ముఖ్య ఉద్దేశం బిజెపి బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల అసలు స్వరూపాలను బీసీ ప్రజలకు తెలి యజేసేందుకు ప్రధానంగా ఈ సమావేశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బీసీ వ్యక్తి అయినటువంటి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధి రామయ్య చే కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ చేసి దానిని అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ వి ఫలమవుతుందన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా జయ లలిత ఉన్న సమయంలో బీసీలకు 57 శాతం రిజర్వేషన్ అమలు చేసిన విధానాన్ని గుర్తు చేశారు. అక్కడ ప్రస్తుతం 69 శాతం రిజర్వేషన్ కొనసాగుతుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీలకు ఇచ్చిన హామీపై లేదు కానీ రాజకీయ జూదం మీద అతని దృష్టి ఉందన్నారు. నాడు రాజ్యాంగం రచించడానికి అప్పటి దేశ నాయకులు ఎన్నో విదేశాలు తిరిగి చివరికి అంబేద్కర్ వద్దకు వచ్చి అంబేద్కర్ ఇచ రాజ్యాంగాన్ని రచించుకున్నారని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే పద్ధతిలో నడుస్తున్నాడని తెలంగాణలోనే మేధావులు ఉండగా ఇతర రాష్ట్రాల తిరుగుతూ సమయాన్ని వృధా చేస్తూ బీసీలకు ఇచ్చిన వాగ్దానాన్ని మర్చిపోతున్నాడు అన్నారు. రేవంత్ ఎన్ని చోట్లకు తిరిగిన తిరిగి తెలంగాణలో ని మేధావులను సంప్రదిస్తేనే బీసీ రిజర్వేషన్ ఎలా అమలు చేయాలో వివరించడం జరుగుతుందన్నారు. బిసి డిక్లరేషన్ పై ఇప్పటివరకు బిఆర్ఎస్ నోరు మెదపడం లేదని, బిజెపి అయితే బీసీ రిజర్వేషన్ అమలు చేయడమే సాధ్యం కాదని తెగేసి చెప్తుందన్నారు. అ మూడు పార్టీలు ఇలాగే వ్యవహరిస్తే అందులో ఉన్న బీసీ ఎంపీలను రోడ్లపై నడవనివ్వని పరిస్థితి వస్తుందన్నారు. 5 టీఎంసీల నీటిని సాధించుకునేందుకు 20 సంవత్సరాలు పోరాడి బిసి యువకుల ఆత్మ బలిదా నాలతో వచ్చిన తెలంగాణను అప్పుడు దొర ఇప్పుడు రెడ్డి మాత్రమే పాలిస్తున్నాడన్నారు.

**బీసీ నాయకులు ముందుకు వచ్చి పోరాడాలి...**

ఏ పార్టీలో ఉన్న బీసీ నాయకులు తమ 42 శాతం బీసీ రిజ ర్వేషన్ కోసం ముందుకు వచ్చి పోరాడవలసిన అవసరం ఉందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితికి ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదని సొంత ఎజెండాతోనే ఈ సాధన సమితి ముందుకు వెళుతుందన్నారు.

**ఏ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ 10 రోజుల్లోనే అమలైంది**

1991లో టీవీ నరసింహారావు ఎకనామికల్ రిజర్వేషన్ ఇవ్వాలని కోరగా అప్పటి మేజర్ సి హా ఆధ్వర్యంలో ప్రత్యేక 9 మంది జడ్జిల తో కమిటీ వేయగా అందులో ఎనిమిది మంది జడ్జిలు ఆర్థిక రిజర్వేషన్లు చెల్లవని కరాకండిగా చెప్పడం జరిగిందన్నారు. తిరిగి జనవరి 17 2019లో పది రోజుల్లోనే ఈడబ్ల్యూఎస్ ను అమలు చేశారన్నారు.

**దేవాలయాల్లోనూ రెడ్డిలేదే పెత్తనం ....**

దేవాలయాల్లో ప్రతి పని చేసేది బీసీలు అయితే దేవాలయ కమిటీలో రెడ్డిలని ఉంచుతున్నారన్నారు. అందులో ప్రధా నంగా క్షవరం చేసే మంగలి కి ఆ కమిటీలో స్థానం కల్పిం చాలన్నారు.

**90 శాతం ఉన్న బహుజనలం నాలుగు శాతం ఉన్న వారిని బిచ్చమెత్తడం అవసరమా ?**

90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు నాలుగు ఐదు శాతం ఉన్న వారిని మాకు అది ఇవ్వండి ఇది ఇవ్వండి అని బిచ్చమెత్తడం అవసరమా అని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని మాట ఇచ్చారని ఆ తర్వాత బీసీ సంఘాల ఒత్తిడి మేరకే కులగరణ చేసి బిసి రిజర్వేషన్ను ప్రకటించా రన్నారు. మేము జీవో ఇచ్చాం కేంద్రం అమలు చేయడం లేదని ఆ నేపాన్ని కేంద్రంపై ఉత్తర చేస్తున్నారని, కేంద్రంతో పోరాడి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయవలసిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కాళేశ్వరం మీద అఘ మేఘాల మీద అఖిల పక్షం నిర్వహించారని, కానీ బీసీల కోసం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఇవన్నీ ప్రజలకు చెప్పి చైతన్యం చేసేందుకే సదస్సులు నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ గౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, గౌడ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు గోపి గౌడ్ ,గౌడ సమన్వయ కమిటీ కన్వీనర్ నారాయణ గౌడ్, బివి ఎం నాయకుడు విట్టల్, రాములు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ పాల్గొన్న యం.పద్మ దేవేందర్ రెడ్డి



**చట్టం రామాయంపేట :** జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కు మద్దతుగా సోమవారం వెంగళరావు నగర్ డివిజన్ కృష్ణ కాంత్ పార్క్ నుండి యూసుఫ్ గూడా చౌరస్తా మీదుగా మధురానగర్ వరకు మహిళా నేతలతో కలిసి అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తో కలసి మాజీ ఉపసభపతి, పద్మ దేవేందర్ రెడ్డి ర్యాలీ ని ర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య, కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల. ఉమా, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా, స్థానిక నాయకులు, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీజ్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి పట్టణంలో అక్రమంగా దాచిన డిఫెన్స్ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు 17 మద్యం సీసాలను సీజ్ చేశారు. నిందితులు యాదగిరి, సుధాకర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంద ర్భంగా ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ మాట్లాడుతూ డిఫెన్స్ మద్యం కలిగి ఉండటం చట్ట రీత్యా నేరమన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై విక్రమ్, సిబ్బంది దేవ కుమార్, శ్రీరాగ, రమ, భాస్కర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## రహదారి పై ఉన్న గుంతలను పూడ్చిన గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు



**చట్టం గంగారం:** కొత్తగూడ మండల కేంద్రం నుండి గంగారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారి మార్గం మధ్యలో భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం భారీ వాహనాలు వచ్చినప్పుడు అందులో ఇరుక్కుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడడం అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడడం ఇలాంటి ఇబ్బం దులను గమనించిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు వారి బృందంతో స్థాని కంగా ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేయడం జరిగింది. భారీ గుంతలను పూడ్చి రవాణా వ్యవస్థకు సహకరించినందుకు గాను వారికి వాహనదారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## 100 డైల్‌ను దుర్వినియోగంపరిచిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష



**చట్టం ధర్పల్లి;** ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో, అక్టోబర్ నెల 31న చిగురాల రాజు, అనే వ్యక్తి ,అర్ధరాత్రి మద్యం మత్తులో 100కు పలుమార్లు డైలీ చేసి పోలీసుల విధులను ఆటంకపరిచి ,సమయం వృధా చేసినందున అతనిపై కేసు నమోదు చేసినట్లు, ఎస్సై కళ్యాణి తెలిపారు. భీంగల్ మండలం దేవక్కపేట గ్రామానికి చెందిన రాజు ,అక్టోబర్ 31న ధర్పల్లి మండలం ఓన్నాజిపేట గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చినట్లు ఆమె తెలిపారు. సోమవారం రాజును జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. 100 డయల్ను ను దుర్వినియోగం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

## కామారెడ్డి ఐఎంఏకు అరుదైన గౌరవం

**ఉన్నత అవార్డు అందజేత**



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** కామారెడ్డి ఐఎంఏకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డు లభించింది. ఈ మేరకు కరీంనగర్ ఐఎంఏ స్టేట్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఐఎంఏ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో అవార్డును సోమవారం బ్రాంచ్ ప్రతినిధులు అందుకున్నారు. ఈ మేరకు కామారెడ్డి ఐఎంఏ అధ్య క్షురాలు డా. రాధా విజయలక్ష్మి, సెక్రెటరీ డా.అరవింద్ గౌడ్ వివరాలు వెల్లడించారు. ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శాతవాహన అర్బన్ డెవలప్‌మెం ట్ ఛైర్మన్ కొమ్మటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారన్నారు. 20242025 సంవత్సరంలో తమ పనితీరుకు ఆల్ రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డును గెలుచుకున్నామన్నారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం



**చట్టం గంగారం :** భారత విప్లవ ఉద్యమంలో తమ అమూ ల్యమైన ప్రాణాలను అర్పించిన అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్ తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ నవంబర్ 1 నుండి 7 వరకు పిలుపునిచ్చిన "విప్లవ వీరుల స్మరణ వారోత్సవం"లో భాగంగా మండలంలోని కోడిసెలమి ట్ట, పందెం గ్రామాలలో సంతాప సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూనెం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, వలసలను నిర్మూలించేం దుకు నూతన ప్రజాస్వామ్య విప్లవం అత్యవసరమని చెప్పారు. ప్రజల హక్కుల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన విప్లవ వీరులను స్మరించడం ద్వారా వారి ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన పాలక పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, మోసపూరిత వాగ్దానాలతో కాలక్షేపం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి కుంభకోణాలు పెరుగుతున్న తరుణంలో ప్రజలు ఐక్యంగా పోరాడాలని పూనెం ప్రభాకర్ అన్నారు. దేశంలో మతోన్మాదం విపరీత రూపం దాల్చి, మతాల మధ్య విభేదాలు, అనుమానాలు పెంచుతున్నదని పేర్కొన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న దోపిడీ, అణచివేతలపై సమరశీల పోరాటాలు సాగించాలన్నారు. వారి లక్ష్యమైన నూతన ప్రజాస్వామ్య విప్లవం దేశంలో విజయవంతమైనప్పుడే అమరవీరుల త్యాగాలకు నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ డివిజన్ నాయకులు ఈక బిక్షం, మండల నాయకులు కుర్సం రంగయ్య, జోగ రాములు, పూనెం రవి, నాగేశ్వరరావు, అశోక్, సతీష్, శ్రీను, వీరస్వామి, లక్ష్మయ్య, వెంకన్న, సాయిలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనర్స్ లైవ్ సర్టిఫికెట్ క్యాంప్



**చట్టం రామగుండం :** ఆర్జీ.1 జియం కార్యాలయం నందు పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనర్స్ లైవ్ సర్టిఫికెట్ క్యాంప్ కొరకు రెండు రోజుల శిభిరం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రామానికి సి.యం. పి.యఫ్ కమిషనర్ పచౌరి, అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ ఆర్జీ.1 జియం హాజరై పెన్షన్ గురించి వివిధ అంశాల మీద తెలియ జేయడం జరిగింది. ఈ సందర్భముగా ఆర్జీ.1 జియం తెలియజేస్తూ పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనర్స్ ఇంతకు ముందు లైవ్ సర్టిఫికెట్ ని ప్రతి సంవత్సరం సమర్పించాలి దీనిని మరింతగా సులభతరం చేయాలని ఉద్దేశంతోనే అటు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం సి.యం.పి.యఫ్ ఆర్గైనేజేషన్ ఆర్జీ.1 ఏరియా ఈ రెండు సంయుక్తంగా కలిసి ఈ పెన్షనర్స్ లైవ్ సర్టిఫికెట్ క్యాంప్ ని పెట్టడం జరిగింది. ఇట్టి క్యాంపు ఆర్జీ.1 ఏరియా జియం ఆఫీస్ లో రెండు రోజులపాటు ఉంటుంది ఇందులో భాగంగా రిటైర్ అయిన వాళ్ళకు ఇబ్బంది కాకూడదు అనే ఉద్దేశంతో లైవ్ సర్టిఫికెట్ అనేది మొబైల్ ద్వారా ఓమంగ్ అనే మొబైల్ యాప్ ద్వారా చేసుకొనుటకు అవకాశం కలదు ఇది కొందరికి చేసుకోలేని వాళ్ళు చదువులేని వారి కోసం ఇక్కడ ప్రత్యేకంగా సి.యం.పి.యఫ్ పెట్టడం జరిగింది. దిని తరువాత కూడా ఇంకొక్క పదిహేను రోజులపాటు దీనిని కొనసాగిస్తాం. అని జియం తెలిపారు. అర్జీ.1 ఏరియా సంబంధించిన వాళ్ళు కానీ ఎవరైనా రిటైర్ అయిన వాళ్ళు ఇక్కడ అర్జీ.1 జియం ఆఫీస్ కి వచ్చి ఇక్కడ హెల్ప్ డెస్క్ నందు డిజిటల్ లైవ్ సెర్టిఫికేట్ అని తెలిపారు. రిటైర్ అయిన వాళ్ళని ఈ సదావకాశం సద్వేదేనియోగించుకోవాలని ఈ రెండు రోజులు కాక మరొక్క 15 రోజుల పాటు ఈ సదావకాశాన్ని కొనసాగింపు చేయాలనీ రిటైర్ అయిన వాళ్ళు అందరు ఇక్కడికి వచ్చేసి వారు ఈ యొక్క సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని జియం కోరారు. ఈ కార్యక్రమంలో సి.యం.పి.యఫ్ కమిషనర్ పచౌరి. అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ ఎఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, యస్ ఓ టు జియం చంద్రశేఖర్, పర్సనల్ అధికారులు శివ నారాయణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, వేణు, శ్రావణ్ కుమార్, ఫిరోజ్ ఖాన్, వీరా రెడ్డి, పించనర్స్ రిటైర్ అయిన అసోసియేషన్ వివి చారి తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టానికి పరిహారంగాఎకరాకు రూ. 50,వేలు నష్టపరిహారం ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి



**చట్టం శంకరపట్నం :** సుమారు 3000 ఎకరాల్లో వరి పంట అకాల వర్షాల వల్ల నీటి పాలు, నేల పాలు అయిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, అన్నారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం, ఎరడపల్లి, గ్రామాలలో సందర్శించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లా డుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతుల పంట పొలాలను అగ్రిక ల్చర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పటికీ, నాలుగు రోజులు గడుస్తున్నా 50% కూడా సర్వే పూర్తి చేయలేదన్నారు. వెంటనే సిబ్బందిని పెంచి పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక అందించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు సగటు దిగుబడి 25 క్వింటాళ్లుగా పరిగణంలో కి తీసుకొని, తగ్గిన దిగుబడి మొత్తానికి డబ్బులు కట్టిం చాలని కోరారు. ధాన్యం కొనుగోలు: తడిసిన ధాన్యానికి ఎలాంటి కోతలు, తరుగు లేకుండా కాంటా పెట్టాలని అయన డిమాండ్ చేశారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్ల కొరత తీవ్రంగా ఉందని, తగిన సరఫరా చేయాలని కోరారు. చైన్ హార్వెస్టర్లు గంటకు ఉన్న రూ. 2500 రేటును రూ. 3500 కు పెంచారని, ప్రభుత్వ అధికారు లు జోక్యం చేసుకొని యజమానులతో సంప్రదించి, నేల వాలిన వరిని హార్వెస్టింగ్ చేయించడానికి చర్యలు తీసు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెలమ రెడ్డి రాజిరెడ్డి, కనకం దుర్గ ప్రసాద్, ఇమ్మడి చక్రపాణి, ఎం యుగంధర్, కనకం భూపతి, రైతులు చిట్యాల రాజయ్య, గొర్రె అనిత, కనకం రాములు, జినుక లచ్చమ్మ, కల్లేపల్లి అంజి, మరక లింగయ్య, బి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## మాత శిశు ఆసుపత్రి వైద్యులతో సమీక్ష సమావేశం : ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కేంద్రంలో మాత శిశు ఆసుపత్రి మరియు ఆక్సిజన్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. ఆసుపత్రిలో అం దుబాటులో ఉన్న పడకలు, ఆక్సిజన్ సదుపాయాలు, ఔషధాల నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను సమీ క్షించి వైద్యాధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఆసుపత్రిలో కొత్త ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు పూర్తయిందని, ప్రస్తుతం అది సక్రమంగా పనిచేస్తోందని అధికారులు వివరించారు. ఔషధాల సరఫరా విషయంలో కొంత నిధుల అవసరం ఉందని తెలియజేయగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెంటనే మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో సంప్రదించి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. మాత శిశు ఆసుపత్రి నాలుగు జిల్లాల ప్రజలకు నాణ్య మైన వైద్య సేవలు అందిస్తున్నదని పేర్కొంటూ, ఈ ఆసుపత్రిని విస్తరించేందుకు 200 కోట్ల రూపాయల వ్యయంతో 230 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టిన ట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కూడా పూర్తయిందని, త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సంద ర్శనలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, సూప రింటెండెంట్ కృష్ణమూర్తి, ఆర్ఎమ్ఓలు డాక్టర్ సుమన్ మోహన్ రావు, డాక్టర్ గీతిక, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, లాభాల బోనస్ చెల్లించడంలో నిర్లక్ష్యం

- ఐ కృష్ణ జిఎల్బికెఎస్. ఐఎఫ్టియు వర్కింగ్ ప్రెసిడెంట్




**చట్టం రామగుండం :** గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్టియు) ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరిఖని ఐఎఫ్టియు కార్యాలయంలో జరిగింది. ఈ యొక్క సమావేశంలో గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్టియు) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఐ కృష్ణ. మాట్లాడుతూ... సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయిన టువంటి కార్మికులకు 2425. సంవత్సరానికి సంబంధిం చిన లాభాల వా ట, లాభాల బోనస్ (దీపావళి). సింగరేణి యాజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులతో పాటు రిటైర్డ్ అయిన కార్మికు లకు ఇప్పటివరకు రావలసిన లాభాల వాటా, లాభాల బోనస్ చెల్లించడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రిటైర్డ్ కార్మికులు తమకు రావలసిన వీటి గురించి ఎదురుచూస్తున్నారనీ యూనియన్లు కూడా ఎవరు మాట్లాడటం లేదనీ ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతి నిధ్య సంఘాలు సింగరేణి యాజమాన్యంతో చర్చించి ఒక డేట్ పెట్టి వెంటనే వీరికి 2425 సంవత్సరానికి సం బంధించిన లాభాల వా ట, లాభాల బోనస్ ను నిర్లక్ష్యం చేయకుండా చెల్లించాలన్నారు. సింగరేణి యాజమాన్యం రిటైర్డ్ కార్మికుల ఎదురుచూపులు, ఆందోళన అర్థం చేసు కోవాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్, జీ ఎల్ బి కే ఎస్ ఐ ఎఫ్ టీ యు. నాయకులు ఐ రాజేశం ఎం కొమరయ్య, ఎస్ ప్రసాద్, ఎడ్ల రవికుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మధుశేఖర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆర్మూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంజే ఆసుపత్రిలో సోమవారం రోజు చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు, ఏంజే ఆసుపత్రి అధినేత డాక్టర్ మధుశేఖర్, జన్మదినాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ప్రజలకు తనవంతు సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడూ నిర్వహించాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. నవనాథ సిద్దేశ్వరుని ఆశీర్వాదా లతో డాక్టర్ మధు శేఖర్, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జన్మదినం సందర్భంగా ఓపి సేవలను కేవలం 100 రూపాయలకే తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్మూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చౌల్ సందీప్, గౌరవ అధ్యక్షులు గంగుల పద్మారావు, ఉపాధ్యక్షులు జాన రమేష్, కోశాధికారి అబ్దుల్ అజీమ్, సీనియర్ జర్నలిస్టులు పుట్టి మురళి, రాజేశ్వర్ గౌడ్, పింజ సుదర్శన్, పోహర్ క్రాంతి, కలిగోట చిన్న, రాజేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు

- మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గాలింపు చర్యలు



**చట్టం మంథని :** మంథని పట్టణంలోని మర్రివాడకు చెందిన రవి కంటి సాయి (30) అనే యువకుడు గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లి గల్లంతయ్యాడు. ఈ సంఘటనపై రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆందోళన వ్యక్తం చేస్తూ, గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం వెంటనే గాలింపు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. సమాచారం అందుకున్న వెంటనే మంథని పోలీసులు, అగ్నిమా పక సిబ్బంది,మంథని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. గల్లంతైన రవి కంటి సాయి ఆచూకీ కోసం గోదావరిలో తీవ్రంగా శోధిస్తున్నారు.మంత్రి శ్రీధర్ బాబు గల్లంతైన వ్యక్తి కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పి, భరోసా ఇచ్చారు.

## సింగరేణిలో గుర్తింపు పొందిన యూనియన్ గా కార్మికులకు ఏం చేశారు?

- హెచ్ఎంఎస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గోషిక అశోక్ సూటి ప్రశ్న



**చట్టం రామగుండం :** సింగరేణి సంస్థలో రెండు సంవత్సరాల క్రితం డిసెంబర్ 27న జరిగిన ఎన్నికల్లో గుర్తింపు పొందిన యూనియన్ గా ఏఐటీసీ గెలిచిన విషయం సింగరేణి వ్యాప్తంగా ఉన్న కార్మికుల అందరికీ తెలిసిందే ఆనాటి నుండి మరో నెల రోజుల్లో వారి ఎన్నికల గడివు ముగియనుండగా ఇప్పుడు సమ్మెలు, ధర్నాలు, బయటాయింపుల పేరుతోకార్మికులను మభ్యపెట్టించి పోరాటాలు చేస్తా మని ప్రకటించడం హాస్యాస్పదంగా సిగ్గుచేటుగా ఉందని అశోక్ విమర్శించారు. కార్మికుల సమస్యల కోసం ఈనెల 6న ధర్నాలు 8న సమ్మె నోటీసులు చేస్తామని హెచ్చరించడం కాదు బెదిరించడం కాదు యాజమాన్యాన్ని దమ్ముంటే నోటీసులు ఇచ్చి కార్మికుల్లోకి వచ్చి సమ్మె చేయించండి.... లేదా మాతో కలిసి రండి మేము మనం అందరం కలిసి సమస్యల పరిష్కారం కోసం సమ్మెలు చేస్తామని ఎద్దేవ చేస్తూ అశోక్ పిలుపునిచ్చారు.. అనారోగ్యం తో ఉన్న కార్మికులు వాలంటరీ రిటైర్మెంట్ పెట్టుకుంటే ఎంతమందికి మీరు డిపెండెంట్ లకు ఉద్యోగాలు ఇప్పించారో శ్వేత పత్రం ద్వారా తెలుపండి అని సవాల్ చేశారు. ఆసుపత్రులలో సరైన సర్జన్లు లేక,ఉన్నవారు సక్రమంగా పనిచేయక అనేకమంది కార్మికులు సింగరేణి ఆస్పత్రికి వెళ్లకుండా భయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటూ ఉంటే మీరు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ ఉన్నారే తప్ప ఎవరి కోసమైనా పోరాటం చేసి వారికి న్యాయం చేశారా ఆత్మ విమర్శన చేసుకోండి అని సూచించారు. సింగరేణిలో యాజమాన్యం కార్మికులను కుదించే విధంగా కొత్త కొత్త చట్టాలు కొత్త కొత్త జీవోలు తీసుకువచ్చి అమలు చేయడానికి ముందుకు వస్తుంటే కనీసం ఒక్కసారైనా యాజమాన్యాన్ని ప్రశ్నించారా వాటి కొరకు పోరాటం చేశారా ఎందుకు ఈ వివక్ష మీకు అంటూ విమర్శిస్తూ మళ్ళీ గుర్తింపుని ఎన్నికల్లో ఓట్లు వేయడానికి వస్తే కార్మికులు సరైన గుణపాఠం చెప్తారని అన్నారు.. ఇలాంటి మరెన్నో సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే సమ్మె నోటీస్ ఇవ్వండి మీకు దమ్ముంటే లేకుంటే చెప్పండి హెచ్ఎంఎస్ నోటీస్ ఇస్తుంది కలిసి రండి సమ్మె చేసి సమస్యను పరిష్కరిద్దాం అంటూ అశోక్ గుర్తింపు పొందిన సంఘానికి కార్మికుల పక్షాన సవాల్ చేశారు.

## డాక్టర్ మధు శేఖర్ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎం జే ఆసుపత్రిలో సోమవారం రోజు డాక్టర్ మధు శేఖర్ జన్మదిన సం దర్భంగా ఆర్మూర్ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, యూత్ సభ్యులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుశేఖర్, మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృ తజ్ఞతలు చెప్పారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గల ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా అందిస్తానన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని అన్నారు. అదేవిధంగా ఓపి ఫీజులు ఇప్పటినుండి 100 రూపాయలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కా ర్యక్రమంలో రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, తదితరులు ఉన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

CHATTAM NEWS

నిజామాబాద్
మంగళవారం
04.11.2025



# మళ్ళీ మొదలైన విడిసిల పెత్తనాలు

**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలోని చాకిర్యాల్ గ్రామంలో విడిసి సభ్యుల ఆగడాలు మితిమీరుతున్నాయి అన్న ఆదివాసీ నాయకుడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రామచందర్. సోమవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాకిర్యాల్ గ్రామంలో విడిసి సభ్యుల ఆగడాలు తట్టుకోలేక గత వారం రోజుల క్రితం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. నిజాలు తెలియాలనే ఉద్దేశంతో ఈరోజు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆనాడు ప్రభుత్వము పేద ప్రజలకు అసైన్మెంట్ భూములను ఇచ్చి దాని తర్వాత పట్టా పాస్బుక్కులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగానే గ్రామంలో నివసించే 48 నాయకపోడు కుటుంబాల అందరికి కలిసి ఐదున్నర ఎకరాల అసైన్మెంట్ ల్యాండ్ ని పట్టాగా మార్చి పాస్బుక్కులు కూడా అందజేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ఆ పాస్ బుక్ ల ద్వారా కూడా రైతు బందులను



కూడా తీసుకోవడం జరుగుతుంది. కానీ దాన్ని ఇప్పుడు సాగు చేయడం క్రమంలో విడిసి సభ్యుల కన్ను ఆ భూమి పై పడ్డదన్నారు. దాన్ని చదును చేయించడం జరుగుతుంది. ఇప్పుడు విడిసి సభ్యులు ఎందుకంటే ఇది ప్రభుత్వ భూమి ప్రభుత్వం ఇచ్చిన భూమి మీకు పుణ్యానికి వచ్చిన భూమి మీరు ఎక్కడ కూడా సంపాదించుకోలేదు అంటున్నారు. అందులో నుంచి మాకు ఒక ఎకరం భూమిని మీరు ఇవ్వాలి కేటాయించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. ఇట్టి విషయమై గత మూడు సంవత్సరాల క్రితమే ఒకసారి ఆ గ్రామానికి వెళ్ళి మాట్లాడం కూడా జరిగిందన్నారు. మేము జిల్లా అధ్యక్షుల పక్షాన పోయి మాట్లాడడం జరిగిందన్నారు. అటువంటి సందర్భంలో ఏం చేశారంటే మాకు కేటాయించారు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారు నేను దీన్ని తీవ్రంగా ఖండిస్తున్న అన్నారు. మరి ఏదైతే మాకు రాజకీయ అండగాని ధన బలంగాని మాకు లేదు. చట్టాన్ని నమ్ముకుని న్యాయపోరాటం ద్వారా మేము పోరాటం చేస్తాం అన్నారు. ఈ కార్తీక మాసంలో భీమన్న ఉత్సవాలు అని చెప్పేసి మా కులా దైవాన్ని మేము ఘనంగా పండుగ నిర్వహించుకుంటాం అందులో భాగంగానే మనవాళ్ళు కూడా నిన్ననే మరి భీమన్న ఉత్సవాన్ని అదే భూమిలో చేయడం జరిగిందన్నారు. విడిసి సభ్యులు వచ్చి మీకు గవర్నమెంట్ ఇచ్చిన భూమి కదా మేము కూడా పూజలు చేస్తాం అంటూ అక్కడికి రావడం జరుగుతుంది. ఇది ఎక్కడి న్యాయం అని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అయ్యా జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, అధికార ప్రతినిధి పుట్ట దేవేందర్, ఎక్స్ సర్పంచ్ చంటి శ్రీనివాస్, విడిసి సభ్యులు బంటు లింగం, బొంత గోపి, బొంత నాగన్న, పుట్ట దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మధుశేఖర్‌కు జన్మదినం సందర్భంగా బుద్ధ ధర్మ సారం పుస్తకం అందజేత



**చట్టం ఆర్మూర్;** వైద్యం వ్యాపారమై మానవత్వమే మాయమైపోతున్న ఈ రోజుల్లో శారీరక రుగ్మతలకు సామాజిక రుగ్మతలకు చికిత్స చేస్తూ విలువలతో కూడిన ప్రజా వైద్యునిగా జన హృదయాలను గెల్చి నిరంతరం ప్రజాసేవలో కోనసాగుతున్న సర్వోత్తమ డాక్టర్ మధుశేఖర్, జన్మదినం సందర్భంగా అంబేద్కరైట్లు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎం.జె ఆసుపత్రి ఆవరణంలో చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్, జన్మదిన వేడుకలు ఘనంగా జరగాయి. ఈ సందర్భంగా సర్వ ధర్మీయ, సర్వ జాతుల, మరి ముఖ్యంగా పేద ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిల్చిపోతున్న ఆయనకు ప్రొఫెసర్ పి.లక్ష్మీనరసు రచించిన బుద్ధ ధర్మ సారం, అనే గొప్ప పుస్తకాన్ని అందజేసి శాలువ పూల మాలలతో అంబేద్కరైట్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ తమ జీవితంలో మరెన్నో సేవ కార్యక్రమాలు చేయూత సంస్థ ద్వారా నిర్వహించాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆర్మూర్ మండల అధ్యక్షుడు పింజ సుదర్శన్, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి జిన్నా జనార్దన్, మోర్తాడ్ మండల అధ్యక్షుడు అంగులి మాలజీ, సీనియర్ అంబేద్కరైట్ పింజ భోజన్న, ఘోడ్కే రవీందర్ కటికే, ప్రఖ్యాత గాయకులు ఇర్గాల సుమన్, ఇర్గాల గణేష్, సురేష్ వాగ్మారే, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు.

## మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడికి ఆంప్స ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి శివారులో గల సెయింట్ పాల్ పాఠశాలలో సోమవారం రోజు న్యాయవాది సెయింట్ పాల్ బబ్లూ, ఆర్మూర్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడిగా నియమితులైనందున ఆంప్స ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ జిల్లా అధ్యక్షుడు పొలపల్లి సుందర్, ఆంప్స అధ్యక్షుడు భారత్ చంద్ర మల్లయ్య, స్కాలర్స్ వేణు, నలంద ప్రసాద్, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, భార్గవి గోపి కృష్ణ, ప్రజ్ఞ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు



**చట్టం ఆర్మూర్:** సేవే మానవతా ధర్మం అనే నినాదాన్ని నిజ జీవితంలో ఆచరించి, అనేక మంది బాధితులకు ఆపన్నహస్తంగా నిలుస్తున్న డాక్టర్ మధు శేఖర్, మీ జన్మదినం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ ఆధ్వర్యంలో నడుస్తున్న చేయూత స్వచ్ఛంద సంస్థ అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అనాధలకు ఆధారం, విద్యార్థులకు ప్రేరణ, రోగులకు ప్రాణాధారం అవుతోంది. మీ సేవా తత్వం సమాజానికి స్ఫూర్తి మానవతా విలువలతో నిండి ఉన్న మీ ప్రయాణం మరెన్నో జీవితాలకు వెలుగునివ్వలని ఆకాంక్షిస్తున్నాము. మీ ఆరోగ్యం, ఆనందం, సేవా విస్తారం మరింత అభివృద్ధి చెందాలని చేయూత కుటుంబం మీ అభిమానులందరి తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు అని బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు శుభాకాంక్షలు తెలిపినారు వీరితోపాటు పింజా అభినవ్, పసుపుల నరేష్, దొండి నిశ్చయ్ దీప్, కన్నం ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన సిద్ధుల గుట్ట



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్టపై కార్తీక మాసం రెండవ సోమవారం రోజు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నవనాథ సిద్ధేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివాలయంలో ఉసిరి దీపాలు వెలిగించి, ఆలయ పంతులుకు దీప దానాలు చేశారు. వయానాలు ఇచ్చారు. కొండ పై ఉన్న అన్ని ఆలయాలను దర్శించుకున్నారు. శ్రీశ్రీశ్రీ నంది మహారాజ్ ఆధ్వర్యంలో రామాలయం నుండి కోనేరు వరకు తిరిగి రామాలయం వరకు ఘనంగా పల్లకి సేవను భక్తి పాటలు పాడుతూ భజన చేస్తూ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నేటి అన్నదాతలైన గడ్డం లావణ్య, భూమారెడ్డి దంపతులు, యమాద్రి ఈషా మనస్విని, సాటేకర్ కల్పన మహేష్‌దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం కొండపై నిర్మిస్తున్న కాటేజీలకు దాతలు విరాళాలు ఏమైనా చేయదలిస్తే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పిసీ గంగారెడ్డి, కోడిగల మల్లయ్య, చరణ్ రెడ్డి, జిమ్మీ రవి సంధ్య, కొంతం మంజుల మురళీధర్, ప్రశాంత్ గౌడ్, హజారి సతీష్, బాషెట్టి నరేష్, రామా గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

## బస్ ప్రమాదంపై ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్పందన

**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** చేవెళ్ల మండలం మీర్జాపూర్ సమీపంలో చోటుచేసుకున్న బస్ ప్రమాదం పట్ల నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ "ఇలాంటి ఘోర ప్రమాదాలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యంగా నడిపే కంకర టిప్పర్ల వలన అమాయక ప్రజల ప్రాణాలు బలికావడం చాలా బాధాకరం. ప్రమాదానికి కారణమైన టిప్పర్ యజమానుల లైసెన్సులు వెంటనే రద్దు చేయాలి. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలి. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం కల్పించాలి" అన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్

**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలను డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. క్యాంపు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో వినతిపత్రాన్ని కార్యాలయ గేటుకు అతికించి తమ నిరసనను తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ, "గత ఐదేళ్లుగా విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం మాత్రమే కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులను మోసం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు విద్యార్థులకు న్యాయం చేస్తామని, రీయింబర్స్మెంట్ పథకాలను సమయానికి అమలు చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు అమలు చేయలేదు" అని తెలిపారు. అక్బర్ ఇంకా మాట్లాడుతూ, "ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్, బీఫార్మసీ, ఎంబీబీఎస్ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీని



ఫలితంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కి పిలుపునిచ్చాయి" అని వివరించారు. "దసరా, దీపావళి వరకు 1200 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. వెంటనే స్పందించి 8200 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. విద్యాశాఖ మంత్రిని రాష్ట్రానికి కేటాయించాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి మంత్రులు, ముఖ్యమంత్రి ఇళ్లను ముట్టడిస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, నాయకులు అఖిల్, రాకేష్, జునైద్, సమీర్, సాయిల్, ప్రభాకర్, చందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక లోకాధాలత్ నవంబర్ 15న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి

**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 15న ప్రత్యేక లోకాధాలత్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ కోర్టుల్లో ప్రత్యేక లోకాధాలత్‌లు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, "రాజీ పడదగిన కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఇది మంచి అవకాశం. కుటుంబ తగాదాలు, భార్యాభర్తల వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, భూముల సంబంధిత కేసులు వంటి వాటిని ఈ లోకాధాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చు. కోర్టుల్లో ఇలాంటి కేసులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండకుండా, పరస్పర అవగాహనతో రాజీ పడేలా ప్రజలు ముందుకు రావాలి" అని సూచించారు. అలాగే కోర్టు పరిధిలో 'మధ్యవర్తిత్వ కేంద్రం (మేడియేషన్ సెంటర్)' కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం శిక్షణ పొందిన మధ్యవర్తులు, రెండు పక్షాల మధ్య ఉన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించేలా కృషి చేస్తారని



చెప్పారు. సున్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు, "రాజీ కుదిరిన సందర్భంలో, రెండు పక్షాలకూ చట్టపరమైన రక్షణ లభిస్తుంది. అదేవిధంగా పేద ప్రజలకు న్యాయం అందించేందుకు జిల్లా న్యాయసేవా సంస్థ (District Legal Services Authority) ద్వారా ఉచిత న్యాయసహాయం అందించబడుతుంది. న్యాయవాది నియమించుకునే సామర్థ్యం లేని వారికి ఉచిత న్యాయవాదులను నియమించి, న్యాయం జరుగేలా చర్యలు తీసుకుంటున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేసిన సిపి





**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలల పాఠశాల ఆవరణలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న క్రీడలు నేటితో ముగిశాయి. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలలో భాగంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా యువత డ్రగ్స్ చెడు వ్యసనాలకు దూరముగా ఉండేందుకు యువత కోసం కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఐపిఎస్. ఆయన మాట్లాడుతూ, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ వారి సరికొత్త ఆలోచన యువత సన్మార్గంలో నడిచినప్పుడు దేశ భవిష్యత్తు బాగుండేది అన్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్ మైదానం యందు 28 స్కూల్స్ నుండి 120 టీంలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరముగా ఉండేందుకు యువత కోసం కబడి టోర్నమెంట్ వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమాన్ని ఆర్మూర్ పోలీస్ వారి ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి నిర్వహించడం జరిగింది. నేడు ఈ వాలీబాల్ టోర్నమెంట్ కు ముగింపు కార్యక్రమంలో ఉపల్గొన్నారు. కబడ్డీ టోర్నమెంట్ మరియు వాలీబాల్ టోర్నమెంట్ ల ముగింపు కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్, మాట్లాడుతూ ప్రియమైన యువకులకు మీరందరూ ఈ కబడి, వాలీబాల్ టోర్నమెంట్ లో ఉత్సాహంగా పాల్గొని ఆటలో స్ఫూర్తిని చూపించినందులకు ప్రతీ ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇది కేవలం ఒక ఆట మాత్రమే కాదు, మిమ్మల్ని నైతికంగా, శారీరకంగా, మానసికంగా బలంగా తీర్చిదిద్దే ఒక మంచి సాధనంగా కూడా భావించాలి. నేడు, మన సమాజంలో, యువత పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులవుతున్నారు. ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి. సత్యనారాయణ గౌడ్, హెడ్ మాస్టర్ కన్వీనర్ లక్ష్మీనరసయ్య, మండలవిద్యాధికారి పింజ రాజ గంగారం, 28 జట్ల క్రీడాకారులు ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆకస్మిక తనిఖీ చేసిన 108 కోఆర్డినేటర్ సయ్యద్ ఇమ్రాన్



**చట్టం: శంకరపట్నం :** కరీంనగర్ జిల్లా 108 కోఆర్డినేటర్ సయ్యద్ ఇమ్రాన్ సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలు మరియు వాటి పని తీరును పరిశీలించారు. ఔషధాలు, రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు ప్రథమ చికిత్స తప్పకుండా అందించాలని తెలియజేశారు. ఈ నెలలో అస్తమా కేసులు మరియు ఛాతి నొప్పి కేసులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున, అంబులెన్స్‌లో ఆక్సిజన్ తప్పకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కేశవపట్నం 108 సిబ్బంది పనితీరుపై కోఆర్డినేటర్ సయ్యద్ ఇమ్రాన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బందిలో ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి మరియు పైలెట్ కాజా ఖలీల్ ఉల్లా పాల్గొన్నారు.

## క్రీడోత్సవాలకు ప్రోత్సాహకం అందజేత



**చట్టం నవీపేట్:** నవీపేట్ మండలం నాళేశ్వర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీలకు గ్రామ తాజా మాజీ సర్పంచ్ ద్యాగాసరిన్ తన వంతు సహాయంగా 15000 రూపాయలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అందజేశారు. అలాగే గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ వారు తమ వంతుగా 30 వేల రూపాయలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ ద్యాగసరిన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు.

- ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం మానేసి విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ తక్షణమే చెల్లించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు లక్షల రూపాయల కంటే తక్కువ ఆదాయంగల బీసీ కుటుంబాల విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ చేస్తామని చేసిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల ముందు విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం విడ్డూరంగా ఉందని విద్యార్థులు అంటే ఇంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించనందున ఈ రోజు నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ మొదలైన కాలేజీల యాజమాన్యాలు బంధు పాటిస్తున్నాయని ఫలితంగా లక్షలాది విద్యార్థులకు విద్యా బోధన ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల చదువు పూర్తయిన సర్టిఫికెట్స్ పొందలేక ఉద్యోగాలకు, పైచదువులకు అవకాశాలు కోల్పోయి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ సత్వరమే విడుదల చేయడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని లేనిచో విద్యార్థుల మరియు వారి తల్లిదండ్రుల ఆగ్రహానికి ప్రభుత్వం గురిగాక తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**చట్టం న్యూస్ మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల పరిధిలోని గోవూర్ గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన రైతులు సీఎం చిత్రపటానికి, ఏనుగు రవీందర్ రెడ్డి చిత్రపటానికి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గోవూర్ గ్రామ రైతు సమన్వయ అధ్యక్షుడు పాల్వంచ రామ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి రైతుల ఖాతాలలో ఖరీఫ్ వడ్ల బోనస్ క్వింటాల్ కి 500 రూపాయల చొప్పున రైతుల ఖాతాలలో జమ అయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. గోవూర్ గ్రామ రైతులు మాట్లాడుతూ ఇలాంటి ఆపాత్కాల సమయంలో రైతులను గుర్తించి బోనస్ డబ్బులను రైతుల యొక్క ఖాతాలలో జమ చేయడం చాలా సంతోషమైన విషయమని అన్నారు. ఈ పలాభిషేక కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, పసుల రాజు, కురుమే సాయిలు, ఎమ్మెల్యే సాయిలు, కుమ్మరి సాయిలు, పి. అబ్బయ్య, ఎండి సాబీర్, గ్రామానికి చెందిన రైతుల పాల్గొన్నారు.

## వర్ని పోలీస్ స్టేషన్లో వ్యక్తి అదృశ్య కేసు నమోదు



**చట్టం న్యూస్ మోస్రా :** నిజామాబాద్ జిల్లాలోని వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని హుముపూర్ గ్రామానికి చెందిన కొడిచెర్ల హనుమాన్లు(49) అతను తేదీ 1:11:3025 రోజు సాయంత్రం ఇంటి నుండి బయలుదేరి ఈరోజు వరకు ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యుడైన తన అల్లుడు వర్ని పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేయగా వర్ని ఎస్సై యు. మహేష్, కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియచేసారు.

## కార్తీక భక్తి వెలుగుల్లో చిన్న వాల్గోట్ గ్రామం

- తులసి వ్రతంతో మహిళల ఆధ్యాత్మికోత్సాహం



**చట్టం / నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలో గల చిన్న వాల్గోట్ గ్రామంలో నేడు కార్తీక మాసం పవిత్రతతో పల్లెలన్నీ పూల వాసనలతో, దీపాల వెలుగులతో కళకళలాడుతున్న వేళ, చిన్న వాల్గోట్ గ్రామం సోమవారం స్త్రీ శక్తి, భక్తి, సాంప్రదాయాల సమ్మేళనంగా మారింది. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తులసి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన తులసి వృక్షం చుట్టూ దీపాల వరుసలు వెలిగించగా, కీర్తనలు, మంత్రోచ్చారణలతో ఆ వాతావరణం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. ఈ సందర్భంగా మహిళలు బొట్టు, గాజులు, చీర వైనం సమర్పించుకుంటూ సోదరీభావాన్ని పంచుకున్నారు. నవ్వులు, మంత్రాలు, భక్తి నినాదాలతో పల్లె ప్రాంగణం ప్రాణం పోసుకున్నట్లు మారింది. పూజ అనంతరం పాల్గొన్న మహిళలు పరస్పరం ప్రసాదం పంచుకుని, కుటుంబ సుఖశాంతి, గ్రామాభివృద్ధి కోసం తులసమ్మను ప్రార్థించారు. కార్తీక దీపాల కాంతులతో చిన్న వాల్గోట్ గ్రామం ఈ రాత్రి మిణుగురుల మాదిరిగా మెరిసిపోయింది. మహిళల భక్తి, బంధం, ఆనందం కలిసిన ఆ దృశ్యం గ్రామ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది.

## ఎల్లారెడ్డి పెద్దచెరువుకు అభివృద్ధి రూపురేఖలు..!

- రూ.3 కోట్లతో పెద్దచెరువు ముస్తాబు – ఎమ్మెల్యే మదన్ మోహన్
- వినోదానికి కొత్త అడ్రస్‌గా మారబోతున్న పెద్దచెరువు



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణంలోని పెద్దచెరువు త్వరలోనే కొత్త అందాలను సంతరించుకోనుంది. పట్టణ ప్రజల వినోదం, విశ్రాంతికి అనువుగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దచెరువును ఆధునిక సదుపాయాలతో అలంకరించి, ప్రజలందరికీ ఆకర్షణీయమైన విశ్రాంతి కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. పార్కులు, ఫుడ్ కోర్టులు, ఓపెన్ జిమ్, ఆధునిక లైటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. పెద్దచెరువు అభివృద్ధి పూర్తయ్యాక ఎల్లారెడ్డి పట్టణ ప్రజలకు ఇది గర్వకారణంగా మారుతుందని ఆయన అన్నారు. పర్యాటక ఆకర్షణగా మారే ఈ ప్రాజెక్ట్ స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోసేలా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి, ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District, Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001., Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com